News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :29 | ఖమ్మం | బుధవారం, మార్చి 19, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకం

- రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రక్రియను పూర్తి చేసింది
- బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలియజేయడం హర్షణీయం
- వర్గీకరణ ఉద్యమంలో మృతి చెందినవారి కుటుంబాలను ఆదుకుంటాం
- ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఎన్నో ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వర్గీకరణ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలియజేయడం హర్షణీయమన్నారు. దళితులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. "తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ఎంత సంక్లిష్టంగా ఉన్నా కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ పరిష్కారం చూపారు. వర్గీకరణ అంశమూ అంతే సంక్లిష్టమైనది. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం జరిగింది. ఇందులో ఎంతోమంది అసువులు బాశారు. వారందరికీ నివాళులు అర్పిస్తున్నాను. 2007లో అప్పటి ప్రభుత్వం సభలో వర్గీకరణ బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అదే ఏడాది ఉషా మెహ్రా కమిషన్ ఏర్పాటు చేసి వర్గీకరణకు ప్రయత్నం చేసింది. మొదటి నుంచి దళితులకు కాంగ్రెస్

వివరాలు 2లో..



# రూ.3 లక్షల కోట్లకు పైనే పద్దు

- గ్యారంటీ హామీలకు భారీగా నిధులు?
- నీటిపారుదల, వ్యవసాయం, విద్య, ఇంధన శాఖలకు అధిక ప్రాధాన్యం
- నేడు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి భట్టి

వివరాలు 2లో..



వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.3 లక్షల కోట్లకు పైనే ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుత ఏడాది బడ్జెట్ రూ.2.90 లక్షల కోట్లు కాగా ఆదాయం అంచనాల కన్నా రూ.50 వేల కోట్ల వరకూ తగ్గుదల నమోదయ్యే సూచనలున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు 2025-26 ఆర్థిక సంవత్సరానికి పద్దును ప్రవేశపెట్టనున్నారు. సభలో ప్రవేశపెట్టడానికి ముందు మంత్రివర్గం సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనుంది. పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి గ్రాంట్లు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఈ ఏడాది ఆదాయం లక్ష్యాల మేరకు రాలేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో

## భూమి మీద అడుగుపెట్టిన సునీతా విలియమ్స్..
### 9 నెలల నిరీక్షణకు తెర..



9 నెలలుగా అంతరిక్షంలో చిక్కుకుపోయిన ఆస్ట్రోనాట్స్ సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ లు సురక్షితంగా భూమి మీద అడుగుపెట్టారు.భారత కాలమానం ప్రకారం బుధవారం ( మార్చి 19 ) తెల్లవారుజామున 3:27 గంటలకు భూమి మీదకు క్షేమంగా అడుగుపెట్టారు.

వివరాలు 2లో..

### బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో బిగ్ ట్విస్ట్..
## రంగంలోకి ఈడీ..!



హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాసులకు కక్కుర్తి పడి వేల మంది ప్రాణాలు పోవడానికి కారణమవుతోన్న బెట్టింగ్ యాప్స్?కు ప్రమోషన్లు చేస్తోన్న సెలబ్రెటీలపై ఇప్పటికే పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే 11 మంది సెలబ్రెటీలపై కేసులు నమోదు చేశారు. వీరికి నోటీసులు జారీ చేసి.. విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో బిగ్ ట్విస్ట్ నెలకొంది. బెట్టింగ్ యాప్స్ వ్యవహారం కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్?ఫోర్స్?మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి చేరింది.

వివరాలు 2లో..

### ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్..
## కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

- కృష్ణా నది ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్
- సుప్రీంకోర్టులో విచారణ
- రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు నోటీసులు

వివరాలు 2లో..



కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది. కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

### ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్
## రూపురేఖలు మారిపోతాయి



- ఆర్ఆర్ఆర్' గురించి కీలక అప్డేట్ ఇచ్చిన కోమటిరెడ్డి
- రెండు నెలల్లో ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించేందుకు గడ్కరీ హామీ ఇచ్చారన్న కోమటిరెడ్డి
- మూడున్నర నుంచి నాలుగేళ్లలో పనులు పూర్తి చేస్తామని వెల్లడి
- ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని వ్యాఖ్య

వివరాలు 2లో..

## అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు



- ఇటీవల వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్పు
- తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగింపు
- తీవ్రస్థాయిలో స్పందించిన షర్మిల

వివరాలు 2లో..

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ పనిచేస్తే...
## ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు నా నెత్తిన చల్లుకుంటా

- మంత్రి ఉత్తమ్ సూర్యాపేటకు ఎస్ఆర్ఎస్పీ నీళ్లు తీసుకురావాలన్న జగదీశ్ రెడ్డి
- మంత్రి అలా చేస్తే ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు తన నెత్తిన పోసుకుంటానని ప్రకటన
- పరిపాలన చేతగాక కాంగ్రెస్ వాళ్లు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఫైర్

వివరాలు 2లో..



## ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను పంచుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



- ఏపీ అసెంబ్లీలో ఫొటో షూట్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కూడా హాజరయ్యారన్న రఘురామకృష్ణరాజు
- నెట్టింట ఫొటోల సందడి

వివరాలు 2లో..

## పిటిషనర్ కు రూ.1 కోటి జరిమానా విధించిన తెలంగాణ హైకోర్టు...

- పిటిషనర్‌పై న్యాయమూర్తికి చిర్రెత్తుకొచ్చింది
- సంచలన తీర్పు వెలువరించిన హైకోర్టు న్యాయమూర్తి
- తప్పుడు పత్రాలతో పిటిషన్ దాఖలు చేయడంపై ఆగ్రహం

వివరాలు 2లో..



## ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్
# రూపురేఖలు మారిపోతాయి

హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్ రోడ్డు) గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో చర్చలు జరిపానని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్ మెంట్ పూర్తి చేసి పంపుతామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. రెండు నెలల్లో పనులు ప్రారంభించేందుకు గడ్కరీ హామీ ఇచ్చారని కోమటిరెడ్డి తెలిపారు. మూడున్నర నుంచి నాలుగేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్ఆర్ఆర్ గురించి గడ్కరీని ఏడుసార్లు కలిశానని తెలిపారు. బీఆర్ఎస్ నేతల మాదిరి రోడ్లను అమ్ముకునే అలవాటు తమకు లేదని చెప్పారు.

ఆర్ఆర్ఆర్ భూసేకరణకు ప్రజలు సహకరించాలని కోమటిరెడ్డి కోరారు. మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులు చేస్తామని తెలిపారు. అధికారులపై దాడులు చేయించి అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు.

# రూ.3 లక్షల కోట్లకు పైనే పద్దు

- మొదటి పేజి తరువాయి

అధికారంలోకి వచ్చిన తరవాత లోక్‌సభ ఎన్నికల కారణంగా 2024 ఫిబ్రవరిలో తొలుత ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ఏప్రిల్, మే, జూన్ నెలల కోసం శాసనసభలో ప్రవేశపెట్టింది. మిగిలిన 9 నెలల కోసం 2024 జులై 25న పూర్తి పద్దును ప్రవేశపెట్టింది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను తొలిసారి ఇప్పుడు ప్రవేశపెట్టబోతోంది. రాష్ట్ర ఆదాయంపై పూర్తి వాస్తవాలు తెలిశాయని, వాస్తవిక అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ప్రభుత్వం చెపుతోంది.

**రూ.26 వేల కోట్లు అడిగిన సాగునీటి పారుదల శాఖ**

ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ హామీలకు అధికంగా నిధులు కేటాయిస్తారని సమాచారం. కొత్తగా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ, మెట్రో రైలు విస్తరణ, ప్రాంతీయ వలయ రహదారి, దీనికి అనుసంధానంగా రేడియల్ రోడ్ల నిర్మాణం వంటివాటికి కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ప్రధానంగా నీటిపారుదల, వ్యవసాయం, విద్య, రోడ్లు-భవనాలు, గృహనిర్మాణం, ఇంధన శాఖలకు అత్యధికంగా నిధులు దక్కనున్నాయి. సాగునీటి పారుదల శాఖ రూ.26 వేల కోట్లు అడిగింది. విద్యాశాఖ రూ.30 వేల కోట్లు అడిగినట్లు సమాచారం. కొత్తగా నిర్మించే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలకే రూ.11 వేల కోట్లు అవసరమని అంచనా. వ్యవసాయానికి ఉచిత కరెంటు పథకానికి, కరెంటు ఛార్జీలు పెంచకుండా రాయితీ భరించేందుకు కలిపి రూ.21 వేల కోట్లు కావాలని రాష్ట్ర ఇంధనశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వగా దాదాపు రూ.18 వేల కోట్లు కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇంధనశాఖకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించకుంటే వచ్చే నెల ఒకటి నుంచి కరెంటు ఛార్జీలు పెంచడానికి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలు ఇచ్చే అవకాశాలున్నందున అడిగిన సొమ్ములో అత్యధికశాతం ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

'గ్యారంటీ'గా నిధులు: గ్యారంటీ హామీల అమలు కింద ... వచ్చే ఏడాది రైతుభరోసాకు రూ.15 వేల కోట్లు, 9.69 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.37,274 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు, కొత్తగా ప్రారంభించే నగరాభివృద్ధి పథకానికి రూ.4 వేల కోట్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.4 వేల కోట్లు, పేదల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటుకు రూ.2 వేల కోట్లు అవసరమని సంబంధిత శాఖల నుంచి ప్రతిపాదనలు అందాయి. ఇవన్నీ గ్యారంటీ హామీల పద్దు కింద వస్తున్నందున భారీగా నిధులు కేటాయించే అవకాశాలున్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలు, ఆయా వర్గాల సంక్షేమ పథకాలకు ఈ ఏడాది రూ.63 వేల కోట్లు కేటాయించినందున వచ్చే ఏడాది అంతకంటే పెంచే అవకాశాలున్నాయి.

**ఆరోగ్యానికీ దండిగా....**

2024-25 సంవత్సరం పద్దులో వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వం రూ.11,800

కోట్లు కేటాయించింది. ఈ సారి కనీసం రూ.18 వేల కోట్ల వరకు మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంపై ఇచ్చిన గ్యారంటీ హామీ అమలులో భాగంగా ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించే యోచనలో ఉంది. ఈ పథకానికి ఇప్పుడు ప్రతినెలా రూ.50 కోట్లు అందుతున్నాయి. వీటిని రూ.వంద కోట్లకు పెంచాలని వైద్యశాఖ కోరినట్లు తెలిసింది.

# ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకం

- మొదటి పేజి తరువాయి

ప్రాధాన్యం ఇస్తోంది. అంబేద్కర్‌కు కేంద్ర మొదటి మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా కాంగ్రెస్ అవకాశం కల్పించింది. బాబూ జగ్జీవన్‌రామ్‌ను రక్షణశాఖ మంత్రిని చేసింది. దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. ఎన్నో ఒడుదొడుకులు ఎదురైనా లోక్‌సభలో తెలంగాణ బిల్లును ఆమోదించిన సభాపతి మీరా కుమార్ దళిత బిడ్డే. దళితుడైన మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. రాష్ట్రంలో అధికారమిస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని 2018 ఎన్నికల్లోనే రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లోనూ ఖర్గే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి వర్గీకరణను పూర్తి చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన గంటలోపే నూటిని నూరుపాళ్లు అమలు చేస్తామని నాడు సభలో ప్రభుత్వం ప్రకటించింది. జనాభా, అక్షరాస్యత శాతం, వృత్తులు, ఉద్యోగాలను పరిగణనలోకి తీసుకుని వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. సభ్యులుగా దామోదర్ రాజనర్సింహ, మల్లు రవి, సీతక్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను నియమించాం. ఈ కమిటీ ఇచ్చిన సూచనలతో జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2025 ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉప సంఘానికి షమీమ్ అక్తర్ నివేదిక ఇచ్చారు. ఆ మరుసటి రోజే కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. ఎస్సీలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్లను కమిషన్.. 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి కేటాయింపులు చేసింది. సామాజికంగా, విద్యపరంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడిన వారిలో 15 ఉప కులాలు ఉన్నాయని గుర్తించి గ్రూప్-1 కింద ఒక శాతం, మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 ఉప కులాలకు గ్రూప్-2 కింద 9 శాతం, గణనీయంగా లబ్ధిపొందిన 26 ఉపకులాలను గ్రూప్-3 కింద 5 శాతం రిజర్వేషన్లను కమిషన్ కేటాయిచింది. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మంద కృష్ణ మాదిగతోపాటు ఎంతోమంది పాల్గొన్నారు. కొందరు మరణించారు. తెలంగాణ ఉద్యమంలో, మాదిగ ఉప కులాల ఉద్యమంలో ప్రమాదవశాత్తు చనిపోయినవారి కుటుంబాలను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో, రాజీవ్ యువ వికాసం కింద ఆయా కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తాం.

**2026 జనాభా లెక్కల అనంతరం రిజర్వేషన్ల పెంపు**

ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచాలని కాంగ్రెస్ సభ్యుడు వివేక్ వెంకటస్వామి కోరారు. దాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది. రిజర్వేషన్లను అమలు చేయాలంటే సహేతుక విధానం ఉండాలి. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద 2011 జనాభా లెక్కల సమాచారం మాత్రమే ఉంది. 2026లో కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు చేపడుతుంది. అనంతరం దామాషా ప్రకారం మూడు గ్రూపులకు రిజర్వేషన్లు పెంచుతాం. చట్టపరంగా ఎలాంటి చిక్కులు లేకుండా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. గతంలో ఏవైనా అన్యాయాలు జరిగినా సరిదిద్దుతాం. ఇలాంటి విషయాల్లో ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రతిపక్షాలను కలుపుకొని ముందుకెళ్తాం. రిజర్వేషన్ల అమలులోనూ పారదర్శకత పాటిస్తాం. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా 51 శాతం మంది ఆమోదిస్తే ప్రజాస్వామ్యంలో సరిపోతుంది. కానీ, ఎస్సీ వర్గీకరణకు నూటికి నూరు శాతం మద్దతు పలికారు. సభలో భారాస, సీపీఐ, భాజపా, ఎంఐఎంతోపాటు సభ వెలుపల అనేక సంఘాలు ప్రభుత్వానికి మద్దతు పలికాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**సీఎంకు, మంత్రికి సభ్యుల అభినందనలు**

ఎమ్మెల్యేలు మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన అనంతరం సభలో సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి దామోదర్ రాజనర్సింహను ఎస్సీ ఎమ్మెల్యేలతోపాటు ఇతర సభ్యులు అభినందించారు. బిల్లు ఆమోదం పొందడానికి సహకరించినందుకు భారాస, సీపీఐ, భాజపా, ఎంఐఎం సభ్యుల స్థానాల వద్దకు మంత్రి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

## భూమి మీద అడుగుపెట్టిన
# సునీతా విలియమ్స్..
## 9 నెలల నిరీక్షణకు తెర..

- మొదటి పేజి తరువాయి

స్పేస్ ఎక్స్ కి చెందిన క్రూ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ లో అంతరిక్షం నుండి బయలుదేరిన ఆస్ట్రోనాట్స్ సుమారు 18 గంటల ప్రయాణించిన తర్వాత ఫ్లోరిడా తీర ప్రాంతంలో ల్యాండ్ అయ్యారు.

ఎనిమిది రోజుల మిషన్ కోసమని అంతరిక్షానికి వెళ్లి, తొమ్మిది నెలలకుపైగా అక్కడే చిక్కుకుపోయారు సునీతా విలియమ్స్ ఎన్నో అవాంతరాల తర్వాత భూమికి తిరిగి బయలుదేరారు. సునీతతోపాటు నాసా ఆస్ట్రోనాట్లు బుచ్ విల్మోర్, నిక్ హేగ్, రష్యన్ కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ తోకూడిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10:35 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అన్ డాక్ అయి భూమికి బయలుదేరింది. ముందుగా సునీత, ఇతర ఆస్ట్రోనాట్లు క్రూ డ్రాగన్ క్యాప్సూల్? లోకి చేరుకున్న తర్వాత అది ఐఎస్ఎస్ నుంచి విడిపోయింది. ఆ తర్వాత క్యాప్సూల్ హ్యాచ్ (మూత) క్లోజ్ అయింది. అనంతరం భూమి చుట్టూ కక్ష్యలో తిరుగుతూ 17 గంటల రిటర్న్ జర్నీని క్యాప్సూల్ మొదలుపెట్టింది. బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా వద్ద సముద్రంలో క్యాప్సూల్ స్ప్లాష్ డౌన్ అయ్యింది. ఆ వెంటనే క్యాప్సూల్?ను తీరానికి చేర్చిన తర్వాత అందులో నుంచి ఆస్ట్రోనాట్లు బయటకు వచ్చారు. తర్వాత మెడికల్ టెస్టుల కోసం నేరుగా నాసా స్పేస్ సెంటర్?కు తరలించారు.

ఇన్నాళ్లూ అతరిక్షంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో గడిపినందున వారు భూమిపై తిరిగి గ్రావిటీ పరిస్థితులకు అలవాటుపడేందుకు కొన్ని నెలల సమయం పట్టనుంది. కాగా, సునీత, విల్మోర్ స్పేస్‌ఎక్స్ క్రూ 9 మిషన్ లో భాగంగా గతేడాది జూన్ 5న బోయింగ్ స్టార్ లైనర్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్?కు వెళ్లారు. వారం తర్వాత వారు తిరిగి రావాల్సి ఉండగా, స్టార్ లైనర్?లో వరుసగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో వారి రిటర్న్ జర్నీ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా గత శనివారం స్పేస్‌ఎక్స్ కంపెనీ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా క్రూ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్?ను పంపగా, అందులోనే సునీత, ఇతర ఆస్ట్రోనాట్లు తిరిగి వచ్చారు.

## పిటిషనర్ కు రూ.1 కోటి జరిమానా విధించిన తెలంగాణ హైకోర్టు...

ఓ పిటిషనర్‌పై హైకోర్టు న్యాయమూర్తికి చిర్రెత్తుకొచ్చింది. తప్పుడు పత్రాలతో పిటిషన్ దాఖలు చేసి, విలువైన న్యాయస్థానం సమయాన్ని వృథా చేసినందుకు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెలువరించారు. పిటిషనర్‌కు ఏకంగా కోటి రూపాయల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. తనకు బండ్లగూడ మండలం కందికల్ గ్రామ సర్వే నెంబర్ 310/1, 310/2 లలో 9.11 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది కందగట్ల ధీరజ్ వాదనలు వినిపించారు. భూముల రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ బండ్లగూడ తహశీల్దార్ లేఖ రాశారని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ తన భూమిని సేల్‌డీడ్ చేసుకునేలా రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించాలని కోరారు. అయితే, పిటిషనర్ పేర్కొన్న సర్వే నెంబర్ కందికల్ గ్రామంలో లేదని, తప్పుడు పత్రాలు సృష్టించి వెంకటరామిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తున్నారని ప్రభుత్వ న్యాయవాది (జీపీ) వివరించారు. అంతే కాకుండా ఈ భూమిపై గతంలోనే పిటిషనర్ తండ్రి హైకోర్టులో రెండు పిటిషన్‌లు వేశారని, వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లను తర్వాత ఆయన విరమించుకున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ఈ పిటిషన్ల గురించి వెంకట్రామిరెడ్డి తన అఫిడవిట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు.

ప్రభుత్వ న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక .. పిటిషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ పనిచేస్తే...
## ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు నా నెత్తిన చల్లుకుంటా

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సూర్యాపేటలో పంటలు ఎండిపోతున్నా యని, ఎండిపోయిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 30వేలు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా మాట్లాడుతూ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేటకు ఎస్ఆర్ఎస్పీ దేవాదుల ప్రాజెక్ట్ నీళ్లు తీసుకొస్తే ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు తన నెత్తిన చల్లుకుంటానని అన్నారు. ప్రభుత్వం, మంత్రులు చేతగాని మాటలు మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి విమర్శించారు.

పరిపాలన చేతగాక వ్యక్తిగతంగా దుర్భాషలాడుతున్నారని ఆయన ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక అన్ని వర్గాల వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. ఎందుకంటే కాంగ్రెస్ సర్కార్‌పై రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఇలా అందరూ అసహనంతో ఉన్నారన్నారు. కాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు ఆయనపై సస్పెన్షన్ ఉంటుంది.

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

యాదగిరిగుట్ట ఆలయా నికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవాదా య చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పద్దెనిమిది మంది సభ్యులతో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు (వైటీడీ) ఉంటుందని వెల్లడించారు. ఈ బోర్డు పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు.వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారని వెల్లడించారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద పాఠశాలలను స్థాపించుకోవచ్చని తెలిపారు.గతంలో యాదగిరిగుట్ట భక్తులకు సరైన వసతులు లేవని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. యాదగిరిగుట్టను మరింత మెరుగుపరిచేందుకే పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా రూ. 100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

## అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు

ఇటీవల ఏపీలోని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్చడం, కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తొలగించడం తెలిసిందే. దీనిపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో స్పందించారు. సీఎం చంద్రబాబు తీరు అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుగా ఉందని విమర్శించారు. అప్పుడు జగన్ చేసిన తప్పే నేడు చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ అధికారంలో ఉండగా స్వర్గీయ ఎన్టీఆర్ పేరు మార్చి వైసీపీ ప్రభుత్వం అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మహానేత వైఎస్సార్ పేరు చెరిపి ప్రతీకారం తీర్చుకుంటోందని ఆరోపించారు. తద్వారా చంద్రబాబు ప్రభుత్వం కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గాయపరిచిందని తెలిపారు. "వైఎస్సార్ జిల్లాను తిరిగి వైఎస్సార్ కడప జిల్లా పేరుతో సవరించడంలో అభ్యంతరం లేకపోయినా... కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్ అంటే ఎందుకింత కక్ష అని అడుగుతున్నాం. వైఎస్సార్ జిల్లాలో తిరిగి కడప పేరు చేర్చినప్పుడు... విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు ఎన్టీఆర్ విజయవాడ అనో లేక పాత కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాగా పేరు ఎందుకు మార్చలేదు? అని ప్రశ్నిస్తున్నాం.

డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి. దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నేత. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళు ,, పెన్షన్లు లాంటి ప్రజాకర్షక పథకాలకు రూపశిల్పి మహానేత వైఎస్సార్. తెలుగు వారు తమ గుండెల్లో గుడి కట్టుకొని, ఇంట్లో దేవుడి ఫోటోల పక్కన వైఎస్సార్ ఫోటో పెట్టుకొని పూజిస్తున్న గొప్ప నేతకు రాజకీయాలు ఆపాదించడం సరైంది కాదు. ఇది ఆయనకు ఇచ్చే గౌరవం అంతకన్నా కాదు. వైఎస్సార్ అనే పేరు ప్రజల ఆస్తి. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు. వైఎస్సార్ తెలుగు వారి సొత్తు" అని షర్మిల స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను పంచుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

:అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరూ గ్రూప్ ఫొటో దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ ఫొటోల్లో ఉన్నారు. ఈ ఫొటో షూట్ పై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో ఈరోజు ఎమ్మెల్యేలు అందరూ గ్రూప్ ఫొటో తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామ్య ప్రయాణానికి గుర్తుగా, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ప్రత్యేక ఫొటో సెషన్ లో పాల్గొన్నారని రఘురామకృష్ణరాజు వివరించారు. ఈ ఫొటోలో ప్రతిబింబించిన ఐక్యత, బాధ్యత, ప్రజలకు అందించే సేవల పట్ల నిబద్ధత మన ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అటు, ఎమ్మెల్సీలతోనూ చంద్రబాబు, పవన్, లోకేశ్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఫొటోలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా ఉన్నారు.

### బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో బిగ్ ట్విస్ట్..
## రంగంలోకి ఈడీ..!

- మొదటి పేజి తరువాయి

బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసిన యూట్యూబర్ల వ్యవహారంపై ఈడీ ఆరా తీస్తోన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను తెప్పించుకున్న ఈడీ.. బెట్టింగ్ యాప్స్ చెల్లింపులపై విచారిస్తోన్నట్లు తెలిసింది.

మనీ లాండరింగ్, హవాలా రూపంలో చెల్లింపులు జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తోన్న ఈడీ.. పోలీసులు కేసు నమోదు చేసిన 11 మంది యూట్యూబర్ల సంపాదనపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. త్వరలోనే వీరికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచేందుకు ఈడీ రంగం సిద్ధం చేస్తోన్నట్లు టాక్. ఈడీ ఎంట్రీతో ఈ కేసులో నెక్ట్స్ ఏం జరగబోతుందని ఉత్కంఠ నెలకొంది. కాగా, బెట్టింగ్ యాప్?లు ప్రమోషన్ చేస్తున్న 11మంది తెలుగు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో విష్ణుప్రియ, బండారు శేషసాయిని సుప్రిత, ఇమ్రాన్ ఖాన్ (పరేషన్ బాయ్స్), హర్ష సాయి, రీతు చౌదరి , టేస్టీ తేజ, యాంకర్ శ్యామల, కిరణ్ గౌడ్, అజయ్, సన్నీ యాదవ్, సుదీర్?లపై గేమింగ్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# సి సి రోడ్ కు నిధులు మంజూరు, మండల్ అధ్యక్షుడు నవీన్





**మార్చ్ 18 ( సీ కే న్యూస్) చేగుంట :**దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి చొరవతో చేగుంట మండల కేంద్రంలో ఎస్సీ కాలని 1వార్డు లింగమయ్య వద్ద 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన చేగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో మండల్ జనరల్ సెక్రెటరీ ఎండి మోజామీల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, కిసాన్ సెల్ అధ్యక్షులు చౌదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి, సేవాదళ్ నాయకులు పుర్ర ఆగం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, బాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

- శామీమ్ అక్తర్ నివేదిక ప్రకారం లోపాలను సరిచేసి మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.
- జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి.
- గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి



**సీకే న్యూస్ మార్చ్ 18 హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**
స్థానిక ధర్మసాగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మెయిన్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సోంపెల్లి అన్వేష్ మాదిగ, ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు పదో వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ , ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ,గార్లు పాల్గొని మాట్లాడుతూ ఈరోజు జరగబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టబోయే ఎస్సీ వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించుటలో జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఫలితాలను కూడా ప్రభుత్వం నిలిపివేయాలని ఎస్సి వర్గీకరణ ద్వారా మాత్రమే చేపట్టాలని , జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని ఈసందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. లేనియెడల మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేసి మాదిగల హక్కులను సాధించుకుంటాము అన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షులు ఎండి శంషుద్దీన్, విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుక రాజు మాదిగ, మండల నాయకులు బరిగెల ప్రదీప్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు
గాజుల సదానందం, కొలిపాక కొమురయ్య, బి ఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఇంద కృష్ణ,ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు సింగారపు పవన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గంగారపు ప్రదీప్ మాదిగ, సోంపెల్లి సూరిబాబు, గంగారపు చిన్ని, సింగరపు జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# పోడు వ్యవసాయానికి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.






- విద్యార్థులకు పాఠశాల నుండే ప్రకృతి పట్ల అవగాహన కల్పించాలి..
- జిల్లా వ్యాప్తంగా అన్ని వ్యవసాయ భూముల్లో నీటి గుంతల త్రవ్వకాలు చేపట్టాలి.
- ప్రజలకు ఉపయోగపడే మొక్కలనే నాటాలి.
- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 18,** జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కొరకు విద్యుత్తు లైన్ ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారుల ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పోడు వ్యవసాయం కు విద్యుదీకరణ, ఉపాధి హామీ పనుల పురోగతి, త్రాగునీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు త్రవ్వకాలు, మీసేవ దరఖాస్తులు, ధరణి మరియు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోడు పట్టాలు పొందిన రైతులు వ్యవసాయం చేయడానికి వీలుగా నీటి వసతి కల్పించుటకు గాను వ్యవసాయ భూములకు విద్యుదీకరణ కు అవసరమైన లైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో తగిన ప్రణాళికలు రూపొందించాల ని తెలిపారు. ఎక్కడ అయితే విద్యుత్తు లైన్లు అవసరమో పంచాయతీ సెక్రటరీ గుర్తించి, విద్యుత్ లైన్ల మంజూరుకు అవసరమైన పత్రాలు, గ్రామసభ ఆమోదంతో అటవీశాఖ అధికారులకు తెలపడం ద్వారా విద్యుత్ లైన్లు ఏర్పాటు చెయ్యాల ని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు సాధ్యం కానీ ప్రదేశాలలో అటవీ శాఖ అధికారుల ఆమోదం తో బావులు త్రవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు ద్వారా పోడు సాగుకు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. పోడు భూములలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన రైతులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గాను విద్యుత్ లైన్ లో ఏర్పాటు సహకరించాలని అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ ను కలెక్టర్ కోరారు. జిల్లాలోని అన్ని మండల అటవీ శాఖ రేంజర్లు అటవీ శాఖ పరిధిలో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టవలసిన పనులను గుర్తించి నివేదికలు అందించటం ద్వారా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.
జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో ఫామ్ పౌండ్ ( నీటి గుంటలు) త్రవ్వకాల కోసం రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో బోర్ ద్వారా సాగు చేసే రైతులు వివరాలు రేపటిలోగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. బోర్ ద్వారా వ్యవసాయం చేసే ప్రతి రైతు వ్యవసాయ భూమిలో కచ్చితంగా నీటి గుంటల నిర్మాణం చేపట్టాల్సిందే అని కలెక్టర్ స్పష్టం చేశారు. జల శక్తి అభియాన్ లో భాగంగా పంచాయతీ పరిధిలోని ప్రతి కార్యాలయాల్లో, పాఠశాలల్లో, రోడ్డు ప్రక్కన ప్రాంతాలు గుర్తించి ఇంకుడు గుంతలు ఎన్ని నిర్మాణం చేపట్టవచ్చు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టేలా పంచాయతీ సెక్రటరీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేటువంటి బతుకమ్మ పండుగలో పూజకు ఉపయోగించే తంగేడు పువ్వు జిల్లాలో ఎక్కడా కనపడటం లేదని, ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని నర్సరీలలో ఇప్ప, కరక్కాయ, చింత, విష ముష్టి, కుంకుడు, తంగేడు వంటి మొక్కలను పెంచాలని సూచించారు. మొక్కలు పెంచడానికి వీలుగా గింజల సేకరణ చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గింజల సేకరణలో అత్యధికంగా గ్రామ స్థాయిలో 1000, మండల స్థాయిలో 5000 మరియు జిల్లాస్థాయిలో 50,000 బహుమతిగా ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు పాఠశాలల నుండి ప్రకృతి మరియు పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలన్నారు.
వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా మునగ సాగు, అజోల్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చేపల పెంపకం మరియు వెదురు సాగుపై అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు రైతులు తమకు ఈ పంటల గురించి ఎవరూ చెప్పలేదని, అవగాహన కల్పించలేదని దృష్టికి వచ్చిందని, వ్యవసాయ అధికారులు పద్ధతి మార్చుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.
జిల్లావ్యాప్తంగా పెండింగ్ ఓటర్ మార్పులు, చేర్పులు మరియు నూతన ఓటర్ దరఖాస్తులు, మీసేవ కేంద్రాలలో వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ మరియు ధరణి పెండింగ్ దరఖాస్తులు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఉన్న పెండింగ్ ధరణి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇంటికి త్రాగునీటి అందేలా త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అడిషనల్ డి ఆర్ డి ఓ రవి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూర్య, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, మిషన్ భగీరథ నలిని, మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాల విద్యకు నిలయాలు...

**జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,**మణుగూరు ఏరియా పివి కాలనీ సింగరేణి పాటశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేయదమైనది. ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిధిగా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, విశిష్ట అతిధిగా స్కూల్ కరస్పోండెంట్, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిఎం దుర్గం రాంచందర్ విద్యార్థుల ను, వారి తల్లి దండ్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ..... సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాల విద్యకు నిలయాలు సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ పాఠశాలల కు ధీటుగా విద్యార్థులకు సకల సౌకర్యాల తో పాటు వైజ్ఞానిక, సృజనాత్మకతతో కూడిన ఉన్నత విద్యను భోదిస్తూ ఉంది. కాబట్టి సింగరేణి పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు వివిధ రంగాలలో రాణిస్తూ ఉన్నత స్థానాల్లో తమ ప్రతిభను చాటుతు ఎంతో కీర్తి గడిస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత చదువులు చదువుతూ, ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణత సాధిస్తూ గొప్ప విద్యావంతులుగా ఎదిగి తాము చదువుకున్న పాఠశాల పేరు ప్రతిష్టలు మరింతగా పెంచాలని సూచించారు. 100% ఫలితాలతో పాటు వంద శాతం - 10/10 ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. సమయం ఎంతో విలువైనది కాబట్టి సెల్ ఫోన్ లకు, టివి లకు దూరంగా ఉండాలని, సమయాన్ని వృధా చేయకుండా చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధంగా ఉన్న విద్యార్థులతో పాటు వచ్చే సంవత్సరం పదవ తరగతిలో ప్రవేశించనున్న విద్యార్థిని విద్యార్థులు కూడా శ్రద్ధగా చదువుతూ పై చదువులలో జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో ప్రథమ శ్రేణి ర్యాంకులు సాధించడం ద్వారా గొప్ప విద్యావంతులుగా ఎదిగి తల్లిదండ్రులు కన్న కలలు నిజం చెయ్యాలి, సమాజానికి, దేశానికి స్ఫూర్తిదాయకమైన సేవలు అందించాలి అన్నారు.అలాగే ఈ సందర్భంగా సీ అండ్ ఎం డి ఎన్. బలరామ్ నాయక్, మరియు సెక్రెటరీ ( ఎడ్యుకేషన్ ) జి.శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి 10వ తరగతి పరీక్షలలో మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాక్షింస్తూ విద్యార్థులకు అందరికీ శుభాకాంక్షలు తెలియచేసారని పాఠశాల కరెస్పాండెంట్, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అతిధులచే హాల్ టికెట్ మరియు పరీక్ష సామాగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈ జి ఎస్ స్వరూపరాణి, ఆర్ కల్యాణి, ఎన్ అనురాధ, ఎం కృష్ణబాబు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు తదితరాలు పాల్గొన్నారు.

# బీసీ బిల్లుకు అసెంబ్లీలో పాస్ అయినందున స్థానిక ఎమ్మెల్యే వీరాపల్లి శంకర్ ఘనంగా సన్మానించిన బీసీ నాయకులు



**అసెంబ్లీ ఆమోదంపై షాద్ నగర్ లో సంబరాలు**

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వీట్ల పంపిణీ**

**బీసీ బిల్లు పై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసిన బిసి సేన నాయకులు పసుపుల ప్రశాంత్**

**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18:**సర్పంచ్ నుంచి మేయర్ దాకా విద్యా ఉద్యోగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును శాసనసభలో ఆమోదించిన సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీసీ నాయకుల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి. మంగళవారం బిసి బిల్లు ఆమోదంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిసి సేన ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల శ్రీకాంత్, అసెంబ్లీ అధ్యక్షులు బిసి సేన కత్తి చంద్రశేఖరప్ప, అసెంబ్లీ మహిళ బీసీ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, కార్యదర్శులు నరేష్,చందూలాల్ జమాల్పూర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే శంకర్ కు స్వీట్లు తినిపించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో విద్యా ఉపాధి రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ శాసనసభ ఆమోదం వ్యక్తం చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్లమెంటులో మెజార్టీ ఆమోదం తప్పనిసరిగా లభిస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పెడితేనే చట్టబద్ధత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో
జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్, షాద్నగర్ అసెంబ్లీ అధ్యక్షులు బీసీ సేన కత్తి చంద్రశేఖరప్ప, అసెంబ్లీ మహిళా బీసీ మహిళా అధ్యక్షులు బాస వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి భూషణ్ నరేష్,చందులాల్ జమాల్ పూర్,అసెంబ్లీ కోశాధికారి అసెంబ్లీ యువజన ఉపాధ్యక్షులు శివ ముదిరాజ్,షాద్నగర్ టౌన్ బీసీ సేన అధ్యక్షులు తంగేడుపల్లి శంకర్, షాద్నగర్ ఉపాధ్యక్షులు బిసి సేన వరప్రసాద్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్ షాద్నగర్ టౌన్ ప్రధాన కార్యదర్శి బీసీ సేన మల్కాపురం రవి షాద్నగర్ 18వ వార్డు అధ్యక్షులు పిసి సేన సురేందర్ గౌడ్ పసుపుల సత్యం అసెంబ్లీ కన్వీనర్ చౌదర్ గూడెం అధ్యక్షులు బోయ రామచందర్ బీసీ సేన నందిగామ నర్సింలు ప్రధాన కార్యదర్శి తల్లోటి సౌజన్య,ప్రచార కార్యదర్శి చెరుకు మమత, సహాయక కార్యదర్శి నవనీత, మొలగసి బాలమణి తదితరులు పాల్గొన్నారు..

# కళ్ళములోని మిరప కాయలు కాలబెట్టిన దొంగలు అరెస్టు.

- ఇరువురు నిందితులకు రిమాండుకు పంపించిన ఏడుళ్ళ బయ్యారం ఎస్సై రాజకుమార్.
- పురుషోత్తం చేతబడి చేస్తున్నాడన్న అనుమానం తోనే ఆర్థికంగా దెబ్బతీయ టానికి మిర్చిని తగలబెట్టిన ఇరువురు నిందితులు,
- కేసును త్వరగా చేదించిన ఏడుల్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు ,
- ఎస్సై రాజ్ కుమార్ ను డి.ఎస్.పి రవీందర్ రెడ్డి ఈ సందర్భంగా వారిని అభినందించారు..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,**వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి పురుషోత్తం అనే వ్యక్తి అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిరపకాయలు కళ్ళ%శీ%ల్లోకి వెళ్లి ఎండబెట్టిన 50 క్వింటాళ్ల ఎండు మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తలగబెట్టిన విషయం పాఠకులకు విధితమే సంఘటన అనంతరం బాధితుడు ఏడుల్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు ఆనంతరం మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాల ప్రకారం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై రాజకుమార్ కేసు దర్యాప్తును ముమ్మరం సాక్షాధారాల ఆధారంగా నిందితులుగా అదే గ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ సన్నాఫ్ వెంకటేశ్వర్లు, (33 సం") అతనికి మామ వరుస అయినా మంచర్ల వెంకటేశ్వర్లు తండ్రి పుల్లయ్య, (49 సం"), బెస్త,, నిందితులు వెంకటేశ్వరపురం గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుంటే మోటార్ సైకిల్ పై పారిపోతుంటే పట్టుకొని విచారించగా తాండ్ర బాలకృష్ణ అనే వ్యక్తి భార్య గత సంవత్సరం క్రింద చనిపోగా దానికి కారణం పురుషోత్తం మే మంత్రాలు చేయడం వల్లనే తన భార్య చనిపోయిందని అతడు మనసులో కక్ష పెంచుకొని ఈ విషయాన్ని తన మామ వెంకటేశ్వర్లు కు చెప్పగా అతడు కూడా తనను పెద్ద మనిషిగా ఎదగనీయకుండా పురుషోత్తమే అన్ని పంచాయతీల లో అడ్డపడుతున్నాడని అతనిని ఎలాగైనా ఆర్థికంగా దెబ్బ తీయాలని ఇరువురు నిందితులు పథకం ప్రకార%శీ% సరైన సమయం కోసం వేచి చూస్తూ మార్చి 10వ తారీకు అర్ధరాత్రి సమయం లో మిరపకాయల కల్లాల వద్ద ఎవరు కాపలా లేరని నిర్ధారించుకుని పురుషోత్తంనికి సంబంధించిన పొలం కళ్ళంలోని 50 క్వింటాళ్ల వెండి మిర్చినీ బాలకృష్ణ తను వెంట తెచ్చిన ఐదు లీటర్ల పెట్రోలు ఎండు మిర్చి చుట్టూ చెల్లి నిప్పు పెట్టాడు .వెంకటేశ్వర్లు రోడ్డుపై కాపలాగా ఉన్నాడు. మిర్చికి మంటలు అంటుకున్న వెంటనే ఇద్దరు నిందితులు అక్కడి నుండి పరారై వారి ఇళ్లకు చేరుకొని ఆ రాత్రి ఇళ్లలోనే నిద్రించినారు అని పోలీసులు పత్రికాముఖంగా తెలిపారు సోమవారం ఇరువురు నిందితుల నీ రిమాండ్కి తరలించారు .కేసును త్వరగా చేదించిన ఏడుల్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు కుమార్ ఇరువురిని డి.ఎస్.పి రవీందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీనారాయణ దిలీప్, శ్రీనివాస్, రాము ,లక్ష్మయ్య పాల్గొన్నారు.

# నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించండి.

**-జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,**మణుగూరు ఏరియా నందు సింగరేణిలో పని చేస్తూ మెడికల్ ఇన్వలిడేట్ అయిన 10 మంది ఉద్యోగుల కుటుంబాల కు చెందిన అభ్యర్థులకు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ జీఎం కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమం లో కారుణ్య నియామకం క్రింద మొత్తం 09 మంది పురుష డిపెండెంట్లతో పాటు ఒక మహిళా డిపెండెంట్లకు సింగరేణిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ... సింగరేణి అంటే కేవలం ఉద్యోగులకు జీవనోపాధి కల్గించే ఓ సాధారణ సంస్థ కాదు ఉద్యోగుల శ్రమశక్తి అధికారుల మేధోశక్తి కలబోతతో ప్రకృత్తికి విరుద్ధంగా పని చేస్తూ బొగ్గ ఉత్పత్తి చెయ్యడం ద్వారా ఎన్నో పరిశ్రమలకు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాల మనుగడకు ఊతం ఇస్తున్నా గొప్ప సంస్థ మన సింగరేణి, ఇందులో ఉద్యోగం చెయ్యడం అంటే అదో భాధ్యత, ఆ భాధ్యతను సక్రమంగా నిర్వర్తించే వాళ్ళు సుదీర్ఘా కాలం కుటుంబ అవసరాలకు, బిడ్డల బంగారు భవిష్యత్తు సరిపడా సంపాదన జీత భత్యాల రూపంలో పొందవచ్చు. సకల సౌకర్యాలు కూడా పొందవచ్చు, అంతేగాక పదవి విరమణ చేశాక వచ్చే పెన్షన్ తో శేష జీవితం సుఖంగా గడుపవచ్చు. ఇన్ని రకాలుగా ప్రయోజనాలు చేకూర్చే సింగరేణిలో ఉద్యోగం పొందడం గొప్ప అవకాశంగా భావించి నాగాలు చేయకుండా క్రమశిక్షణతో, రక్షణతో నిజాయితీ నిబద్ధతతో పని చేస్తూ ప్రత్యక్షంగా సంస్థ పురోభివృద్ధికి పరోక్షంగా బంగారు తెలంగాణ సహకారానికి తమ శక్తియుక్తులు ధారబోస్తూ ఉత్తమ ఉద్యోగులుగా పేరు పొందాలని ఆకాంక్ష వెలిబుచ్చుతూ జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్), అధికార ప్రతినిధి ఎస్. రమేశ్, డిజిఎం (ఐ ఈ) వెంకట్ రావు , ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్ , రామేశ్వర్ రావు, చంద్ర కిరణ్ ఎం టి ( పర్) తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ అందించిన వర్ధిని ఫౌండేషన్



**సీకే న్యూస్ మార్చ్ 18 హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్ .** వర్తిని ఫౌండేషన్ సహకారంతో ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రానున్న పరీక్షల దృష్ట్యా ఎగ్జామ్ సక్సెస్ కిట్ నీ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక విన్ను , కడియం యువసేన సోషల్ మీడియా ఇంచార్జ్ ఎండి హఫీజ్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్ ముఖ్య అతిథిగా పాల్గొనీ విద్యార్థులకు అందజేశారు.
ఈ కార్యక్రమంలో వర్ధిని ఫౌండేషన్ సభ్యులు తన్నీరు రమేష్ ,గంటే సాంబరాజు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురలీ ,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి.

- భగత్ సింగ్ ,రాజగురు, సుఖదేవ్ లు నేటి విద్యార్థి, యువతరానికి ఆదర్శం కావాలి
- మోడీ కుహనా దేశభక్తిని ఎండగడదాం.
- ట్రంప్ దురహంకారానికి వ్యతిరేకంగా పోరాడుదాం.
- పి వై ఎల్ జిల్లా కార్యదర్శి కొరసా రామకృష్ణ.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,**దేశ స్వాతంత్రం కోసం, బ్రిటిష్ ముష్కరులు అమలు చేసిన అనిచివేత, దోపిడి, దౌర్జన్యాలకు, సామ్రాజ్యానికి వ్యతిరేకంగా నిరంతర పోరాట స్ఫూర్తితో సాగిన భగత్ సింగ్ రాజగురు, సుఖదేవులు నేటి విద్యార్థి, యువతరానికి ఆదర్శం కావాలని పివైయల్ జిల్లా కార్యదర్శి కోర్సా రామ కృష్ణ అన్నారు మంగళవారం దమ్మపేట లోని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆఫీసులో భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి సెమినార్ లో రామకృష్ణ అన్నారు. ఈ సెమినార్ పివైయల్ డివిజన్ అధ్యక్షులు కాక వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ మాట్లాడుతూ..మానవ చరిత్ర పుటలు తిరగేస్తే చార్వాకులు,స్పార్టకస్ వంటి ఉజ్వల తారలు ఉన్నతమైన ప్రగతిశీల ప్రయోజనాల కోసం ప్రాణాలర్పించారని, ప్రపంచ స్థాయిలో చేగువేరా, ఫైడల్ కాస్ట్రో లాంటి విప్లవ వీరులు అమెరికన్ సామ్రాజ్యవాదుల కబంధహస్తాల్లో అమరులయ్యారని అదే కోవలో భారత ఉపఖండం లో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతిలో ఉరి తీయబడినరని భగత్ సింగ్ తన సహచరులు కలలుగన్న సార్వభౌమాధికారం, లౌకికవాదం,సోషలిజం కోసం పోరాడుతున్న ఎందరికో గొప్ప స్ఫూర్తినిస్తుందని వారు అన్నారు. భారతదేశన్ని పట్టిపీడిస్తున్న సామ్రాజవాదానికి, పెట్టుబడిదారు వ్యవస్థకు, మతోన్మాదం,కులతత్వాలకు వ్యతిరేకంగా భారతీయ విద్యార్థి,యువతరం,ప్రజలు భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని దేశంలో మోడీ ప్రభుత్వం కుహానా దేశభక్తిని బట్టబయలు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమెరికాలో నివసిస్తున్న భారత ప్రజలపై అనుసరించే దుశ్చర్యలకు వ్యతిరేకంగా భగత్ సింగ్, రాజగురు,సుఖదేవ్ ల 94వ వర్ధంతి సభలను జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సెమినార్ అనంతరం భగత్ సింగ్ రాజగురు, సుఖదేవుల 94 వ వర్ధంతి సందర్భంగా ముద్రించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సెమినార్ లో పి వై ఎల్ జిల్లా జిల్లా నాయకులు కుంజ అర్జున్, డివిజన్ నాయకులు సున్న జగన్,యుకె మహేష్ మండల నాయకులు కాక చందు,పొట్ట సంతోష్, కురసం తిరుపతిరావు, కురం రవి, కురాశం రాజు, రాజేష్, సోయం నాగేశ్వరావు, తెల్లం నగేష్, తెల్లం చిన్నిరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

# సేవా కార్యక్రమాల్లో మేటి పి.పి.ఎస్.



**పలమనేరు నియోజకవర్గం మార్చి 18 సీకే న్యూస్:**పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏపీఎన్జీజీవో సంఘం సహకారంతో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి వారి ద్వారా స్థానిక ఎన్జీఓ హెూం నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల తో పాటు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. శిబిరంలో 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయగా, ఎంపిక చేసిన వారందరినీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తిరుపతి ఆసుపత్రి కి పంపి, వారికి భోజన వసతులు ఏర్పాటు చేయడంతో పాటు చికిత్స పూర్తయిన పిదప తిరిగి పలమనేరు నందు బస్సు లో పూర్తి ఉచితంగా చేర్చడం జరుగుతుందని పిపిఎస్ అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్ళై, గౌరవాధ్యక్షులు ఆనందబాబు, కార్యదర్శి నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్యులతో పాటు పి.పి.ఎస్ సభ్యులు శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్ రెడ్డి, రాఘవయ్య, దొరస్వామి, దేవరాజులు, పొన్ముడి, నాగప్ప, జగన్నాథం, సన్నిరాజు, సాంబయ్య, రామచంద్ర, సామరాజు, రెడ్డెప్ప నాయుడు, దవణముని, విజయకుమార్, సయ్యద్ నిసార్, నారాయణ, పెన్షనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురురాజారావు, రత్నారెడ్డి, గౌస్ భాషా, గోవిందయ్య తదితరులు పాల్గొని శిబిరం ఏర్పాట్లు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీ

- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఉద్యమాలు, నిరసనలు నిషేధమా?
- ప్రజా పాలనలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఆనాటి ఉద్యమ కేంద్రం ఉస్మానియా యూనివర్సిటీలో నేడు నిషేధాలు పెట్టడం సరికాదు.
- యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. వెంటనే యూనివర్సిటీకి ఇచ్చిన సర్క్యులర్ను వెంటనే రద్దు చేయాలి.
- అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్)
- (ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్



**సి కే న్యూస్ షాద్ నగర్: మార్చ్ 18 :** ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఎలాంటి నిరసనలు ధర్నాలు నిర్వహించరాదని ఉపకులపతి రిజిస్టర్ విడుదల చేసిన సర్క్యులర్ను వెంటనే వెనక్కి తీసుకోవాలిని అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుంది. ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ విశ్వవిద్యాలయం ఎన్నో పోరాటాలు త్యాగాలకు చిహ్నమని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఎంతోమంది వీరులను సమాజానికి పరిచయం చేసిన ఉస్మానియా యూనివర్సిటీ నేల అని పేర్కొన్నారు. అటువంటి నేలపై నియంతృత్వ వైఖరితో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా నిరాసనాలు ధర్నాలు నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేయడం వారి నియంత పోకడకు నిదర్శమని విమర్శించారు. విద్యార్థి ఉద్యమాలకు ఆనచాలని చూస్తే విద్యార్థుల అగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుంది అని ఆకాష్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హెచ్చరించారు.

# భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు..

- అమరజీవి పొట్టి శ్రీరాములు భారతరత్న ఇవ్వాలి..
- సామాజికవేత్త నీల రవీందర్



**సి కే న్యూస్ షాద్ నగర్: మార్చ్ 18 :**చెన్నైలో పుట్టి పెరిగిన శ్రీ పొట్టి శ్రీరాములు ముంబైలో రైల్వే ఉద్యోగం చేశారని చెప్పారు. ఆ తర్వాత గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై సబర్మతి ఆశ్రమానికి వెళ్లారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పలుమార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. గాంధీజీ స్ఫూర్తితో హరిజనులకు ఆలయ ప్రవేశం చేయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గాంధీ స్మారక నిధి సంచాలకులుగా మద్రాస్ రాష్ట్రమంతా పర్యటించేవారని, తద్వారా ఆయనకు ప్రజా సమస్యలు తెలిసేవని చెప్పారు. ఇతరుల కోసం తమ జీవితాన్ని ఫణంగా పెట్టి పోరాడేవాడే నాయకుడిగా నిలుస్తాడని, శ్రీ పొట్టి శ్రీరాములు ఇందుకు నిదర్శనమని అన్నారు. చెన్నై రాయపేట రోడ్డులో గల శ్రీ బులుసు సాంబమూర్తి నివాసంలో నిరాహార దీక్ష ప్రారంభించారని, ఎంతో పట్టుదలతో దీక్షను కొనసాగించి చివరకు ప్రాణత్యాగం చేశారని వివరించారు. అటువంటి మహనీయుడికి భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు.

# చావా సినిమా ఉచిత ప్రదర్శన

- బుధవారం మధ్యాహ్నం 2:00 గంటలకు షాద్ నగర్ పరమేశ్వర థియేటర్
- వీరత్వం, ధైర్యసాహసాలు చాటిచెప్పే గొప్ప చారిత్రక చిత్రం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య ఆధ్వర్యంలో



**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18.:**షాద్ నగర్ పట్టణంలో బుధవారం మధ్యాహ్నం పరమేశ్వర థియేటర్ లో 2:00 గంటలకు చారిత్రక పురుషుల జీవిత గాథలు మనందరికీ స్ఫూర్తినిచ్చేలా గొప్ప కథతో రూపొందిన "చావా" సినిమాను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందే బాబయ్య గారి ఆధ్వర్యంలో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శన షాద్నగర్ పరిధిలోని పరమేశ్వర థియేటర్ లో జరుగుతుంది. చావా సినిమా శివాజీ మహారాజు తనయుడు సంభాజీ రాజు జీవితం, ఆయన వీరత్వం, ధైర్యసాహసాలు చాటిచెప్పే గొప్ప చారిత్రక చిత్రం. ఈ సినిమా దేశభక్తి, ధైర్యం, నమ్మకమే కాదు, యువతకు ఆదర్శంగా నిలిచే గొప్ప సందేశం అందిస్తుంది. ఈ ఉచిత ప్రదర్శన అందరికీ తెరిచివుంచారు. ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఒక మహా యోధుడి గాథను పెద్ద తెరపై వీక్షించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకత్వం విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. సామాజిక స్పృహ, చరిత్రను తెలియజేయడం, దేశభక్తి ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సినిమా ప్రదర్శనకు మీరూ హాజరై, ఓ మహా యోధుడి గాథను తెరపై ఆస్వాదించండి!

## నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని.

- కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతిర్యాల అరుణ్ రాజ్ కోరారు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 18, రాష్ట్రంలోని అయిదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతో 6 వేల కోట్ల రూపాయలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని చేపట్టిందని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ పథకం ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

మార్చి 17 నుంచి ఏప్రిల్ 5 వరకు %ఫ్ట్రిజూం:?/స్త్రశీఎఎఎంఅవష.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ%/ లింక్ ద్వారా ఆన్లైన్ చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జూన్ 2 వ తేదీన 5 లక్షల మంది లబ్దిదారులను ప్రభుత్వం ప్రకటిస్తుందని. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమాన్ని శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారని.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఈ పథకం ద్వారా అర్హత ఉన్న వారికి 1లక్ష నుంచి 4 లక్షల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు.

## ప్రజలపక్షం వహించే పార్టీలనే జనం ఆదరిస్తారు.

- సిపిఐ వందేళ్ల ఉత్సవాలు దేశవ్యాపితంగా ఘనంగా నిర్వహిస్తున్నాం.
- ప్రజా ఉద్యమాల నిర్వహణలో భద్రాద్రి జిల్లా ఆదర్శం.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 18, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీకే ప్రజాదరణ మెండుగా ఉందని, ప్రజలపక్షం వహించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. జగదల్పూరులో సమావేశం ముగించుకొని కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళుతున్న క్రమం లో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్' సందర్శించి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాతో సమావేశమయ్యారు, జిల్లా రాజకీయ పరిస్థతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే ప్రజా పోరాటాలకు రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా ఆదర్శ%శీ%గా నిలుస్తోందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎందరో జాతీయ నాయకులను కమ్యూనిస్టు పార్టీకి అందించిందని, ప్రజా ప్రతినిధులుగా ప్రజా గొంతుకను వినిపించే నేతలను చట్టసభలకు పంపిందన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమిస్తుండటం హర్షణీయమన్నారు. జిల్లాలో ఉన్న పోడుభూముల సమస్యపై, పేదలకు నివేశన స్థలాలు కోసం, రైతాంగ, కార్మిక సమస్యలపై భద్రాద్రి జిల్లా కమ్యూనిస్టు పార్టీ బలమైన ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. సకాలంలో 2025 సభ్యత్వం పూర్తి చేసి రాష్ట్ర కేంద్రానికి అందించడం పట్ల జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. సిపిఐ వందేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాపితంగా శత వసంతోత్సవాలు జరుగుతున్నాయని డిసెంబర్ 26 వరకు ఉత్సవాలు జరుపుతామన్నారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో భారీ భహిరంగ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయన వెంట సిపిఐ జాతీయ నాయకులు రామకృష్ణ పాండే, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఉన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత. పూర్వ విద్యార్థుల సహకారంతో.



సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 18.వలిగొండ మండలం అరూర్ గ్రామం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు, ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్సు,, జమెంటరీ బాక్స్ అందచేసిన %ళ్లూనా% అరూర్ పూర్వ విద్యార్థులు 10%ఏ ూజు% బ్యాచ్ 2007-2008 వలిగొండ మండలం అరూర్ గ్రామంలో ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో 6వ తరగతి నుండి 10,పథోవ తరగతి విద్యార్ధిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యా యుల సమక్షం లో జెడ్ పి హెచ్ ఎస్ అరూర్ స్కూల్లో ఉన్నా 6వ నుండి 10వ తారగతి విద్యార్థి లకు %ూజు% ఫైనల్ పరీక్ష రాయ దానికి మా సహకారంగా పరీక్ష రాయనికి కావాల్సిన వస్తు సమగ్రి పెన్నులు జమెంటరీ %ఎశీఞ% లు,అందచేయడం జరిగింది పరీక్షకు సిద్ధం అయిన విద్యార్థి విద్యార్థులకు తగిన సలహాలు సూచన్లు ఇవడం జరిగింది

విద్యార్థిలకు పరీక్ష రాయదానికి కావాల్సిన వస్తువు సామాగ్రి అందించినద్దుకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉ పాధ్యాయులు 2007-2008%ూజు% బ్యాచ్ కి కృతజ్ఞతలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో బోల్ల కృష్ణ,వేముల అనిల్ కుమార్,బత్తిని సతీష్,చాడ స్వామి, రచ్చ నరేష్ పాల్గొన్నారు.

# బాలమేళా ముగింపు ఉత్సవంలో విద్యాశాఖ అధికారి టి. రమ ని సన్మానించిన జిల్లా కలెక్టర్.






సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 18,బాలమేళా ముగింపు ఉత్సవంలో భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి టి. రమ ని సన్మానించిన జిల్లా కలెక్టర్. ఉత్తమ పరివేక్షణ నిర్వహించినందుకు గాను, రాష్ట్ర విద్యాశాఖ అమలు పరుస్తున్న కార్యక్రమాలను మండలంలో అన్ని పాఠశాలలో నిర్వహింప చేసేటట్లు ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్న సందర్భాలను పురస్కరించుకొని ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా టి. రమని మరియు భద్రాచలం మండలం ఉత్తమ పాఠశాలగా ఎంపిక కాబడిన ఎం పి, యు పి ఎస్ జగదీష్ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్ ని గౌరవ జిల్లా కలెక్టర్ సన్మానించారు.

ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు సహకారము, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారము, జగదీష్ కాలనీ వాసుల సహకారంతో ఈ విజయం సాధించామని విద్యార్థుల యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దడం లో జగదీష్ కాలనీ పాఠశాల ఉపాధ్యాయ బృందం ముందుంటుందని తెలియజేశారు.

## శెట్టిపాలెం స్కూల్లో 10వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ప్యాడ్స్ పెన్నులు పంపిణీ



సీకే న్యూస్ వేములపల్లి మార్చి 18:మంగళవారం వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామంలో తాజా మాజీ ఎంపీటీసీ పల్ల వీరయ్య కుటుంబ సభ్యులు ఈ నెలలో జరిగే పదవతరగతి పరీక్షల సందర్భంగ స్థానికంగ ఉన్న జిల్లా పరిషత్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు పరీక్షలకు సంబందించిన ప్యాడ్స్,పెన్నులు పంపిణీ చేయడం జరిగింది మరియు పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో పల్లా లక్ష్మమ్మ,పళ్ళ అశోక్ పిఎసిఎస్ డైరెక్టర్లు,సీనియర్,మహిళా,యూత్ నాయకులు తాజా మాజీ వార్డు మెంబర్లు మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ చారిత్రక ముందడుగు.

**భద్రాచలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తమ్మళ్ళ వెంకటేశ్వర్లు.**




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ నేడు బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా రాహుల్ గాంధీ కి, మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఉప ్ర ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి,మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావుకి,పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోదేం వీరయ్యకి, బి సీ ఐక్య వేదిక కో కన్వీనర్ భద్రాచలం మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ తమ్మళ్ళ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది రాష్ట్రంలో మరియు దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు పోరాటం చేస్తున్న అన్ని బీసీ సంఘాల సమిష్టి విజయమని బీసీల హక్కుల కోసం కృషి చేస్తున్న వారందరికీ ఇది గర్వకారణం అని అన్నారు. ఈ బిల్లు ద్వారా స్థానిక సంస్థలు, విద్యా మరియు ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కలగనుండటం ఒక చారిత్రక ముందడుగు అని, ఇది దేశవ్యాప్తంగా బీసీ సామాజిక న్యాయ ఉద్యమానికి బలాన్ని చేకూర్చే మైలురాయిగా నిలుస్తుంది అన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

**అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించాలి.**

**రేషన్ కార్డు ప్రామాణికాన్ని తొలగించాలి.**

**సామాజిక కార్యకర్త కర్నె రవి.**

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకుల కు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నియోజకవర్గం లో అధికారులు పారదర్శకంగా అమలు చేయాలని, సామాజిక కార్యకర్త కర్నె రవి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించాలన్నారు. నైపుణ్యం ఉండీ ఉద్యోగం లభించని యువతకు ఈ పథకం కింద ప్రాధాన్యత కల్పించాలని,అర్హులు, నిజమైన నిరుద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా లబ్ది దారులను ఎంపిక చేపట్టలన్నారు. మరో వైపు ఈ పథకానికి ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలంటే వృత్తి నైపుణ్యం, స్టడీ సర్టిఫికెట్లుతో పాటు రేషన్ కార్డు ప్రామాణికంగా పెట్టారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి నూతన రేషన్ కార్డు మంజూరు చేయలేదని, నేటి ప్రజా ప్రభుత్వ పాలన పదిహేను నెలలు గడుస్తున్నా కనీసం గ్రామాలలో ఒక్క కుటుంబాని కి ఆహార భద్రత కార్డులు జారీ కాలేదన్నారు. పాలకుల మాటలు హామీలకే పరిమితం అయ్యాయని ఆరోపిం చారు. దీనితో పథకానికి ధరఖాస్తు చేసుకొనే యువత రేషన్ కార్డులు లేకపోవడంతో పెద్ద ఎత్తున నష్ట పోయే ప్రమాదం ఉందన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు స్వీకరణలో రేషన్ కార్డు ప్రామాణిక కాలాన్ని తొలగించి, మారేదైన గుర్తింపు ను జోడించాలాని ఆయన ప్రభుత్వం కు విజ్ఞప్తి చేశారు.



## వ్యోమగామి సునీత విలియమ్స్ కు భారత జాతీయ పతాకాలతో స్వాగతం పలుకుతూ అభినందనలు



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 18 : విజయోత్సహాలతో అంతరిక్షం నుండి భూమికి తిరిగి వస్తున్న వ్యోమగామి సునీత విలియమ్స్ కు, వివేకనంద సంస్థ సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు భారత జాతీయ పతాకాలతో విజయ నినాదాలు పలికారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు అప్పారావు మాట్లాడుతూ, ఎంతో సాహసవంతంగా, మనోధైర్యంతో 9నెలలు అంతరిక్షంలోనే విజేతగా నిలిచిన సునీత విలియమ్స్ భారతదేశానికి గర్వకారణం అని కొనియాడారు. విజయవంతంగా భూమికి చేరుకోవాలని ఆ భారత మాత ని ప్రార్థిస్తూ శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.

## రాధాకృష్ణ మందిరంలో నూతన గరుడ ధ్వజం ప్రతిస్తంభన కార్యక్రమంలో పాల్గొన్న బత్తిన నవీన్ కుమార్



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 18 : విశాఖ దక్షిణ నియోజకవర్గం 31 వ వార్డు టిడిపి నాయకులు బత్తిన నవీన్ కుమార్ రాధాకృష్ణ మందిరం కమిటీ వారి ఆహ్వానం మేరకు గొల్లలపాలెం నందు ఉన్న శ్రీ రాధాకృష్ణ మందిరంలో

నూతన గరుడ ధ్వజం ప్రతిస్తంభన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం స్వామివారి అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు చేయాలి

**తాహసిల్దార్ కు మెమోరండం అందజేసిన సిపిఎం నాయకులు**

అనంతగిరి మార్చి 18 సి కే న్యూస్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలుచేయాలని సిపిఎం పార్టీ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని తాహశిల్దార్ హిమబిందుకు మెమోరండం అందజేశారు.అనంతరం జిల్లా నాయకులు ములకలపల్లి రాములు,కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని అమలుచేయడంలో విఫలమైందని అన్నారు.గత ప్రభుత్వంలో రేషనకార్డులు లేక ప్రజలు అనే ఇబ్బందులు పడ్డారని తిరిగి ఈ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొక తప్పుదు లేదన్నారు.గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాదే కోటేశ్వరరావు, ఎస్.కె కబీర్ దాస్, గోపతి బిక్షమయ్య, సాదే శ్రీనివాసరావు,గోపతి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణం కు కోటి గోటి తలంబ్రాలు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పాల్గొన్నారు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 18,** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం కు శ్రీ రామమందిరం దగ్గర ఘనంగా కోటి గోటి తలంబ్రాలు వలిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ

సీతారాముల కళ్యాణానికి తలంబ్రాలు కొలవడం అనేది నిజంగా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను సామూహికంగా భక్తి శ్రద్ధలతోని చేసేటువంటి కార్యక్రమము చాలా ఉత్సాహంగా ఆడపడుచులు అందరూ కూడా వచ్చి ఈ కార్యక్రమం లో భాగస్వాములు అయినారు రామ నామము రమ్యమైనది ఆ రామ నామాన్ని తలుచుకుంటూ ఈ పవిత్రమైనటువంటి కార్యక్రమాన్ని మొదలుపెట్టినం అందర్నీ ఆ శ్రీరామచంద్రుడు చల్లగా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో 18 వార్డు ఇంచార్జి దొడ్డి హైమావతి, ఆలయ నిర్వాహకులు చావల శ్రీనివాసరావు, చావల పురుషోత్తం రావు, యాసరపు నర్సింహా రావు,చంద్రగిరి హరికృష్ణ, నారసాని సత్యనారాయణ, దాసరి సంపత్ మాచర్ల ప్రవీణ్ గ్రామంలోని మహిళ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాసనసభలో ప్రభుత్వం బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడం హర్షణీయం



**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్) మార్చి 18:** దేశ చరిత్రలో మొదటిసారిగా శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ విద్య ఉపాధి ఆర్థిక రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు పెంచుతూ బిల్లును శాసనసభ ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి,తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి మునుగోడు ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఎన్ ఎస్ యు ఐ సోషల్ మీడియా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎర్రగోని నవీన్ యాదవ్ పత్రిక ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు రేఖల ప్రభాకర్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 18.**

రేఖల ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.

దేశ చరిత్రలో మొదటిసారిగా శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ విద్య ఉపాధి ఆర్థిక రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు పెంచుతూ బిల్లును శాసనసభ ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి,తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపేట్ జడ్పీ స్కూల్ లో యాన్యువల్ డే కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి




**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18:** కొత్తపేట్ గ్రామంలోని పీఎం జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో మంగళవారం జరిగిన వార్షికోత్సవం సందర్భంగా డే కల్చరల్ ఈవెంట్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంగురంగుల దుస్తులతో తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆన్ హెడ్మాస్టర్ సి మ్ శేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## రానున్న మూడు నెలలు థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు రవాణా చేయాలి.



- విద్యుత్ డిమాండ్కు తగినట్లుగా బొగ్గు ఉత్పత్తి, రవాణా పెరగాలి.
- అన్ని గనుల్లోనూ వేసవి జాగ్రత్తలు పాటించాలి.
- ప్రతీ ఉద్యోగి 8 గంటల పాటు పనిచేసేలా చర్యలు తీసుకోండి.
- అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశం.
- కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ట్రయల్ రన్ విజయవంతంపై హర్షం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చి 18,** తెలంగాణ తోపాటు దేశ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరూ జీఎం లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సింగరేణితో ఇంధన ఒప్పందం ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలకు రోజుకు కనీసం 50 రేకుల వరకు బొగ్గును రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రక్షణతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అలాగే ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని గనుల్లోనూ వేసవి జాగ్రత్త చర్యలను పాటించాలన్నారు. ముఖ్యంగా చల్లటి నీటిని అందుబాటులో ఉంచడం, మజ్జిగ సరఫరా కు ఏర్పాట్లు చేసుకోవడం, రెస్టు షెల్టర్ల వద్ద కూలర్లను , అన్ని యంత్రాల్లో ఏసీ సరిగా పనిచేస్తుందా? లేదా? పరిశీలించాలన్నారు. రానున్న మూడు నెలల్లోనూ విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, రవాణాకు విఘాతం కలగకుండా అన్ని కాంట్రాక్టులను ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు.

ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను ముందే చేరుకున్న కిష్టారం ఓసీ, పీకే ఓసీ-4, జీడీకే-5 ఓసీ, ఆర్జీ ఓసీ-2, ఆర్ కే -6 ఇంక్లైన్, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీ-2 గనుల అధికారులు, కార్మికులకు అభినందనలు తెలిపారు.

కంపెనీ ఆస్తుల పరిరక్షణకు ఎస్టేట్స్, రక్షణ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆక్రమణలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంపెనీలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి కూడా భోజన విరామం మినహా మిగిలిన 8 గంటల సమయాన్ని పూర్తిగా కంపెనీ అభివృద్ధికి, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేసేలా ప్రతీ ఒక్క అధికారి చైతన్య పరచాలని పునరుద్ఘాటించారు. డ్యూటీల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా, మస్టర్ పడి బయట తిరుగుతున్నట్లు తెలిసినా వారిపై వెంటనే క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వాళ్లు ఎవరైనా సరే ఉపేక్షించొద్దన్నారు. కంపెనీ మరో వందేళ్లు మనుగడ సాగించాలంటే పని సంస్కృతి మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్టీపీపీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ట్రయల్ రన్ విజయవంతం అవడం పట్ల సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో మిథనాల్ ఉత్పత్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్ డి ఎం.సుభానీ, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ను విమర్శించే అర్హత మీకు లేదు

- చైర్ పర్సన్ కు తెలియకుండా మున్సిపాలిటీలో పర్యటనలా
- కష్టం మాది.. దర్పం మీదా?
- కొట్టిన కొబ్బరికాయలకు ప్రొసీడింగ్స్ ఎవరు తెచ్చారో చెప్పాలి
- నిధులు తెచ్చే సత్తా ఉంటే కళాశాలకు చందాలు ఎందుకు..?
- మహిళా బీసీ నేతలను గౌరవించడం ఇదేనా?
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్

**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18:** ఆలోచన మాది.. ఆచరణ మాది.. ఫలితం మాత్రం మీదా..? కష్టపడింది లేదు.. కాగితం తెచ్చింది లేదు.. కొబ్బరికాయలు మాత్రం మీరు కొడతారా..? అంటూ కొత్తూరు పురపాలిక సంఘం చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీరుపై ఫైర్ అయ్యారు. భారాస ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కొత్తూరును దత్తత తీసుకుని దగా చేశారన్న ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై చైర్ పర్సన్ ఘాటుగా స్పందించారు. కొత్తూరు వ్యాపిరస్ రిసార్ట్ లో మంగళవారం ఆమె పుర పాలకవర్గం సభ్యులు, పార్టీ కార్యకర్తలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. అంజయ్య యాదవ్ దత్తత తీసుకున్న అనంతరం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వచ్చిన నిధుల వివరాలను వెల్లడించారు. పూర్తి వివరాలు ఆమె మాటల్లోనే..

**రూ.100 కోట్ల నిధులు..**

కొత్తూరు పురపాలక సంఘం ఏర్పడిన అనంతరం అంజయ్య యాదవ్ దత్తత తీసుకున్నారు. మున్సిపాలిటీ భవనం, సమీకృత వ్యవసాయ మార్కెట్, రైతు వేదిక, వైకుంఠధామం, రెండు పడక గదుల ఇళ్ల సముదాయం, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు నిర్మించారు. ఇందులో కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని ఎన్నికల కారణంగా వాయిదా పడ్డాయి. ఇలా వాయిదా పడ్డ పనులనే ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.

**అభివృద్ధి అంటే కుదించడమా..**

పూర్వం ఉన్న స్థితికంటే మరింత మెరుగ్గా ఉండటాన్నే అభివృద్ధి అంటారు. కానీ కాంగ్రెస్ నేతలు దీనికి కొత్త భాష్యం చెప్తున్నారు. నగరీకరణ, జన సాంద్రత పెరగడంతో కొత్తూరు పట్టణంలో రహదారి విస్తరణకు నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా విడతలవారీగా ఆయా వార్డుల్లో రహదారులు పూర్తి చేశాము. పెంజర్ల రహదారిని 60 అడుగుల వెడల్పుతో (దుకాణదారులకు ఇబ్బందులు లేకుండా) విస్తరించాల్సి ఉండగా ఈ లోగా ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ నేతలు తమ అనునాయులకు అనుకూలంగా రహదారిని ఒక్కోచోట ఒక్కోలా నిర్మించారు. ఇందుకు పెంజర్ల, జేపీ దర్గా, కుమ్మరిగూడ రహదారులే ఉదాహరణ. వీరి స్వార్థ ప్రయోజనాల కారణంగా పూలే చౌరస్తాలో వాహనాలు మళ్లెందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీస్ స్టేషన్ సమీపంలో తన బంధు వర్గానికి లబ్ధి చేకూర్చేందుకు రహదారిని కుదించారు. నాలుగో వార్డులో మిషన్ భగీరథ సరఫరాకు ఇబ్బందులు ఉన్నాయి. కొత్త లైన్ వేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు అడ్డుపడుతున్నారు. అంటే స్థానిక వార్డు ప్రజలు దాహార్తితో అల్లాడినా వారికి పట్టింపు లేదు.

**కాగితాలు మావి.. కొబ్బరికాయలు మీవి..**

ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుమ్మరిగూడ రహదారి బీటి పనులకు కొబ్బరికాయ కొట్టారు. అసలు ఈ రహదారికి నిధులు ఎవరు తెచ్చారు? ఎన్ని తెచ్చారు? ఆ జీవో కాపీలు, ప్రొసిడింగ్ కాపీలు ప్రజలకు బహిర్గతపరచాలి. నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హెచ్ ఆర్ డి సి ఎల్ కింద 32 కోట్లు మంజూరు చేయించిన ప్రొసీటింగ్ కాపీలు మా వద్ద ఉన్నాయి. 100 అడుగుల వెడల్పుతో ఉన్న కుమ్మరిగూడ రహదారిని 24 అడుగులకు కుదించడం అభివృద్ధి అంటారా..? పైగా మంత్రి పేరు చెప్పి స్థానిక చెరువులో అక్రమంగా మట్టితోడి రోడ్డుకు వేసిన విషయంపై ఆధారాలతో విజిలెన్స్ కమిషన్ కలిసి ఫిర్యాదు చేస్తాం.

**బిసి మహిళా నేతకు అవమానం**

మాట్లాడితే బీసీలకు సముచిత న్యాయం చేస్తున్నామని ప్రగల్బాలు పలికే కాంగ్రెస్ పార్టీ నేతలకు తమ సొంత నియోజకవర్గంలో మహిళా బీసీ నేతలకు కనీస గౌరవం ఇవ్వడం చేతకాదు. మున్సిపాలిటీలో చైర్పర్సన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లకు తెలియకుండా పర్యటనలు ఎలా చేస్తారు. ఇది బీసీ నేతలను అవమానించడమే. మున్సిపాలిటీ పాలకవర్గం సమావేశం పెట్టుకోవడానికి ఎమ్మెల్యే తేదీ ఖరారు చేయాలా..? మా పరిధిలో సమస్యలేవో మాకు తెలీదా..? మీరు కొత్తూరు మండలానికి మాత్రమే ఎమ్మెల్యేనా లేక ఇతర మండలాలకు కూడానా. అలా అయితే మిగిలిన మండలాల్లోనూ ప్రారంభోత్సవాలు, కొబ్బరికాయలు కొట్టాలి కదా ఎందుకు చేయడం లేదు. వీలైతే నాలుగు కొత్త పనులకు నిధులు మంజూరు చేయించండి. ప్రజలు మీకు అవకాశం ఇచ్చారు కాబట్టి మేము తెచ్చిన పనులకు మీరు కొబ్బరికాయలు కొడుతున్నారన్న విషయాన్ని మరిచిపోయి విమర్శలు చేయడం తగదు. నిజంగా ఇన్ని నిధులు తెచ్చి ప్రారంభోత్సవాలు చేసే సత్తా మీకుంటే డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి చందాలు ఎందుకు వసూలు చేస్తారో ప్రజలకు వివరించాలి. చివరగా అభివృద్ధికి మేము అడ్డు కాదు. నిధులు మేము తెచ్చినా.. మీరు తెచ్చినా అది ప్రజల సొమ్ము. వాటిని శాస్త్రీయంగా, సాంకేతికంగా, పారదర్శకంగా ఖర్చు చేయాలి. మీ ఇష్టానికి రోడ్ల డిజైన్లు మార్చి పనులు చేపడుతాం, ప్రజలను ఇబ్బందులు పెడతామంటే చూస్తూ ఊరుకోబోము.అంటూ ఆమె వివరించారు.



ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాధవి గోపాల్ గౌడ్, చంద్రకళ రాజేందర్ గౌడ్, కోస్గి శ్రీనివాస్, భారాస నేతలు సిటీ కేబుల్ వెంకటేష్, రవి నాయక్, శ్రవణ్ కుమార్ యాదవ్, కరోల్ల లక్ష్మయ్య, శివ చారి తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ మల్టీ హాస్పిటల్ సీజ్ చేసిన డాక్టర్ వి విజయలక్ష్మి...డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ



**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18 :** షాద్ నగర్ పట్టణంలోని బాలాజీ మల్టీస్పెషల్టి ఆసుపత్రిలో "వైద్యం వికటించి వ్యక్తి మృతి" అని మంగళవారం రోజు వివిధ పత్రికలలో ప్రచురణమైన కథనానికి రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వరరావు స్పందించి, షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి కు బాలాజీ హాస్పిటల్ ను సీజ్ చేయమని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారము షాద్ నగర్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి మరియు వారి టీం సభ్యులు బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కి వెళ్లి, నిన్న మృతి చెందిన సామ్య నాయక్ 50 సంవత్సరములు, కేశంపేట మండల్, కోనాయిపల్లి పరిధిలోని లచ్చుతాండకు చెందిన వ్యక్తి గురించి ఆసుపత్రి సిబ్బంది డ్యూటీ డాక్టర్ సింధు, డాక్టర్ అఖిల్ మరియు డాక్టర్ ఫైజల్ తో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడి, పేషెంట్ యొక్క అడ్మిషన్ రిజిస్టర్ జిరాక్స్, పేషంట్ యొక్క కేసెట్ జిరాక్స్ మరియు పేషెంట్ కు సంబంధించిన ల్యాబ్ రిపోర్ట్ లు తీసుకొని ఆస్పత్రికి సీజ్ చేయడం జరిగింది. పేషంట్ కు ఇచ్చిన ట్రీట్మెంట్ గురించి మొత్తం రిపోర్ట్ తయారుచేసి జిల్లా వైద్య అధికారికి పంపిస్తామని తెలియజేశారు. జిల్లా వైద్యాధికారులు అన్ని అన్ని రిపోర్టును లను పరిశీలించి, ఆస్పత్రి సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటారని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు, ఉదయ్ కుమార్ ఫార్మసిస్ట్ మరియు వెంకటముని ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్ ను చేర్చాలి

**వికలాంగుల కార్పొరేషన్ ను బలోపేతం చేయాలి**

**5శాతం వికలాంగులకు కేటాయించాలి**

**అశన్నగారి భుజంగరెడ్డి, జిల్లా అధ్యక్షులు**

**జేర్కోని రాజు, జిల్లా ప్రదాన కార్యదర్శి**



**సి కే న్యూస్ షాద్ నగర్:మార్చ్ 18:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025మార్చి 17నాడు ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ ఎస్టీ బీసీ , మైనారిటీ కార్పొరేషన్ లతో పాటు వికలాంగుల కార్పొరేషన్ ను చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కార్పొరేషన్స్ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6000కోట్ల రూపాయలతో 5లక్షల మంది నిరుద్యోగులకు 1లక్ష నుండి 4 లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ పథకం ద్వారా 25,000 మంది నిరుద్యోగ వికలాంగులకు మేలు జరుగుతుంది. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో 5శాతం ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి కార్పొరేషన్ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎక్కడ కూడా వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనలేదు. రాష్ట్ర ప్రభుత్వం మిగతా కార్పొరేషన్లకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగుల కార్పొరేషన్ కు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం వలన వికలాంగుల కార్పొరేషన్ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం విది విధానాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్స్ ఇచ్చిన నోటిఫికేషన్స్ ను సవరణ చేసి, వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు అయ్యేలా తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలి. వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయకుండా లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం అంటే వికలాంగులను మోసం చేయడమే అవుతుంది. రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్ ను చేర్చకుంటే ఉద్యమం చేస్తామని (ఎన్ పి ఆర్ డి) తెలంగాణ జిల్లా కమిటీ హెచ్చరిస్తుంది.

CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక


## ముదురుతున్న భాషా విధానం


దేశంలో భాషా వివాదం రాజకీయ రంగు పులుముకుంది. తమిళనాడులో ఎలాగైనా హిందీ అమలు జరగాల్సిందేనని కేంద్రం భావిస్తోంది. అయితే అందుకు అవకాశం లేదని, హిందీ భాషను అమలు చేసేదేలేదంటూ తమిళనాడు డీఎంకే సర్కార్ కరాకండిగా చెబుతోంది. దీంతో ఎటూ తేల్చుకోలేని అన్నాడీఎంకే సైతం కేంద్రం పెత్తనం ఏమిటనే వాయిస్ వినిపిస్తోంది. అయితే త్రి భాషా వివాదం రగులుతున్న సమయంలో అనూహ్యంగా గుగూల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను ఇందులోకి లాగారు. భాషల రాజకీయ యుద్ధంలోకి పిచాయ్‌ను ఎందుకు తీసుకొచ్చారనేది ఇప్పుడు హాట్ టాఫిక్ గా మారింది.నియోజక వర్గాల పుర్విభజనతో పాటుగా త్రిభాషా విధానంపై తమిళనాడులో గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ త్రిభాషా విధానంపై చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. పిఠాపురంలో శుక్రవారం జరిగిన పార్టీ ఆవిర్భావసభలో పవ న్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం హిందీని కేంద్రం రాష్ట్రం పై బలవంతంగా రుద్దుతోందంటూ వ్యతిరేకించడాన్ని తప్పుబట్టారు. దక్షిణాదిపై కేంద్రం హిందీని బలవంతంగారుద్దుతున్నారని మాట్లాడుతున్న ప్పుడు తమిళ సినిమాలను హిందీలోకి డబ్బింగ్ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై డీఎంకే కూడా ఘాటుగా స్పందించింది.భాషా విధానంపై తమిళనాడు వైఖరిని పవన్ తప్పుగా అర్థం చేసుకున్నారని పార్టీ అధికార ప్రతినిధి సయీద్ హాఫీజుల్లా అన్నారు. వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలను నేర్చుకోవడాన్ని తాము ఎన్నడూ అడ్డుకోలేదన్నా రు. ఆసక్తి ఉన్న వాళ్లు నేర్చుకోవడం కోసం ఇప్పటికే తమ రాష్ట్రంలో హిం దీ ప్రచార సభలను నిర్వహిస్తున్నామన్న ఆయన అయితే కేంద్రప్రభుత్వం మాత్రం ఎన్ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో రాష్ట్ర ప్రజలపై హిందీ భాషను రుద్దడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.కాగా 1938 నుంచే తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ద్విభాషా విధానాన్నే అమలు చేస్తామని ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని కూడా అమలు చేసుకున్నామని మరో సీనియర్ నేత ఎళంగోవన్ అన్నారు.1968లో బిల్లు ఆమోదం పొందినప్పుడు పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరని, తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ండొచ్చంటూ కాస్త ఘాటుగా స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను సమర్థించే వారు, వ్యతిరేకించేవారు చేసే ప్రకటనలతో ఈ వివాదం మరిం త ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే స్టాలిన్ ప్రభుత్వం ఈ వివాదాన్ని మరింత రాజేసేలాగే కనిపిస్తోంది. బడ్జెట్ ప్రసంగం పాఠంపై రూపీ స్థానంలో తమిళ గుర్తును ఉం చడం తాజా మలుపు. ఈ చర్య ద్వారా స్టాలిన్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ నేతలను మరింత రెచ్చగొట్టినట్లయింది. మరోవైపు నియోజక వర్గా ల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే అన్యాయం పై ఈ నెల 22న ఏర్పాటు చేసిన సదస్సుకు దక్షిణాదిలోని దాదాపు అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. ఇప్పటికే తెంగాణ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి పూర్తి మద్దతు ప్రకటించగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపింది.తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ సమావేశానికి మద్దతు తెలిపారు. మరోవైపు ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామి అయిన డీఎంకే ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి తాము తప్పక హాజరవుతామని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ప్రకటించారు. అన్నిటికి మించి ఒడిశాలో దాదాపు పాతికేళ్ల పాటు అధికారంలో కొనసాగిన, ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న బిజూ జనతాదళ్ కూడా ఈ సమావేశానికి హాజరవుతుండడం విశేషం. ఈ సమావేశం ద్వారా స్టాలిన్ మరోసారి ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తేవడంతో పాటు హిందీ వ్యతిరేక ఆందోళనలతో కలిపి వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకొంటున్నారు.దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క ఏపీ సీఎం, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం దీనిపై తన వైఖరిని స్పష్ట చేయకపోవడం గమనార్హం. ఎన్డీఏ కూటమి భాగస్వామిగా ఉండడమే అందుకు కారణంగా భావించవచ్చు. ఇంత గొడవ జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ నేతలు సన్నాయి నొక్కులతో సరిపెడుతున్నారే తప్ప ఈ రెండు ప్రధాన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వెనుక బీజేపీపెద్దలకు అన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మాదిరిగా తమిళనాడులో కూడా ఏదైనా రహస్య అజెండా ఉందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రంపై పోరాటానికి తమిళ పార్టీలు ఎల్లప్పుడు ముందే ఉంటాయి. ముఖ్యంగా భాష విషయంలో అసలే వెనకడుగు వేయకపోగా.. హిందీ భాషను 1968 తమిళనాడులో ప్రవేశు పెట్టాలనుకుంటే అప్పుడు ఓ యుద్ధమే జరిగింది. తాజాగా కేంద్రం త్రి భాషా విధానాన్ని వ్యతిరేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా సమానికి సై అంటున్నారు. కానీ తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై మాత్రం.. హిందీ ఎందుకు కావాలో తెలుపుతూ సుందర్ పిచాయ్‌కి చెందిన ఓ వీడియోను నెట్టింట పోస్ట్ చేశారు. పాఠశాలలో తాను హిందీని ఎలా నేర్చుకున్నానో అందులో ఆయన చెప్పుకొచ్చారు. తన ఎదుగుదలకు హిందీ కూడా ఓ కారణమని ఆ వీడియోలో చెప్పకనే చెప్పారు. టెక్ దిగ్గజం మూడు భాషలు నేర్చుకోగలిగితే, అదే అవకాశం రాష్ట్రంలోని అన్ని విద్యార్థులకు అందుబాటులో ఉండాలని అన్నామలై అన్నారు. మంత్రుల పిల్లలు, మనవరాళ్ళు పాఠశాలల్లో మూడు భాషలు నేర్చుకోవడానికి అనుమతిస్తూ.. ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులు మాత్రం రెండు భాషలు మాత్రమే నేర్చుకోవాలని బలవంతం చేయడం దారుణమని అన్నామలై ఆరోపించారు.పార్టీని స్థాపించి డీఎంకేను పదేపదే వ్యతిరేకిస్తున్న నటుడు విజయ్ పార్టీ సహా.. తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షం డిఎంకే చిరకాల ప్రత్యర్థి అయిన అన్నాడీఎంకే కూడా డీఎంకే వాదనను బలపరుస్తోంది. తమిళులపై ఉచిత వ్యాఖ్యలు చేశారంటూ పార్లమెంటులో మోషన్ కూడా డీఎంకే దాఖలు చేయడంతో తమిళనాడు మొత్తం ఇపుడు ఇదే అంశంపై బీజేపీకి వ్యతిరేకంగా కౌంటర్ ఇస్తుంది. బీజేపీ మాత్రం ఇప్పటికి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయకపోవడంతో ఈ వివాదం ఎక్కడదాకా వెళుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఏఐతో వైద్య రంగంలో అద్భుతాలు.. వేగంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు

- క్లిష్టమైన డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు
- మానవ పరమైన తప్పిదాలకు చెక్
- వైద్యుల పని సులభతరం
- దీంతో రోగులకు మెరుగైన వైద్య సూచనలు
- రోగి ఇంటి నుంచే చికిత్సలకు వెసులుబాటు
- వేగంగా నూతన ఔషధాల పరిశోధన







మనిషి తన మేధస్సుతో (ఇంటెలిజెన్స్) నాటి నుంచి నేటి వరకు ఎంతో పురోగతి సాధించగా, ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఏఐ) ప్రపంచాన్ని మరింత ఆధునికత వైపు తీసుకెళ్లనుంది. ఎన్నో రంగాల్లో కృత్రిమ మేధ అనివార్యం కాగా, ముఖ్యంగా వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాన్ని ఇది కొత్త పుంతలు తొక్కించనుంది. రోగుల సంక్షేమం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఇలా మొత్తంగా ఆరోగ్య నిర్వహణను వేగవంతం, సమర్థవంతంగా మార్చడమే కాదు, సులభతరం చేయనుంది. ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల్లో ఏఐ ఏ విధమైన మార్పులు తీసుకురానుందనే విషయాన్ని గమనించినట్టయితే..

### వ్యాధి నిర్ధారణ పరీక్షలు/కచ్చితమైన చికిత్సలు

ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఒక రోజులో కొన్ని నమూనాలనే పరీక్షించగలడు. కానీ, ఏఐ ఆధారిత మెషిన్లు తక్కువ సమయంలోనే వేలాది పరీక్షలు నిర్వహించగలవు. దీనివల్ల ఫలితాల్లోనూ కచ్చితత్వం పెరుగుతుంది. ఇదంతా ప్రోగ్రామింగ్ పైనే ఆధారపడి ఉంటుంది. ఒక వైద్యుడు ఒక రోగి కోసం మహా అయితే కొన్ని నిమిషాలే కేటాయించగలడు. రోజువారీగా ఉండే రోగుల రద్దీపైనే ఎంత సమయం వెచ్చించడం అన్నది ఆధారపడి ఉంటుంది.

క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు ఎన్నో పరీక్షలు రాస్తుంటారు. అవి చేయించుకుని రిపోర్టులు తీసుకెళ్లి ఇస్తే వాటిని వివరంగా చూసే తీరిక వారికి ఉండదు. వేగంగా పేజీలు తిప్పేసి మందులు రాసి పంపిస్తుంటారు. దీనివల్ల అన్ని సందర్భాల్లోనూ సమస్యలు వెంటనే నయం అవుతాయన్న గ్యారంటీ ఉండదు. కానీ ఏఐ దీన్ని మరింత సమర్థవంతంగా మార్చగలదు. ఒక రోగికి సంబంధించి ఇమేజ్ లు, రికార్డులు అన్నింటినీ ఏఐ పరిశీలించి ఒక చక్కని నివేదిక ఇవ్వగలదు. ఎక్స్ రే, ఎంఆర్ఐ, స్కాన్, సీటీ స్కాన్ ఇమేజ్ లను మనుషులతో పోలిస్తే ఏఐ మరింత కచ్చితంగా విశ్లేషించగలదు. దీనివల్ల మానవ తప్పిదాలను నివారించొచ్చు. ఇమేజ్ ల ఆధారంగా రోగికి ఉన్న సమస్యపై ఏఐ ఇచ్చిన నివేదికను రేడియాలజిస్టులు, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సులభంగా అర్థం చేసుకోగలరు. అవసరమైతే వారు కూడా మరోసారి వేగంగా ఇమేజ్ ను పరిశీలించగలరు. సమయం ఆదాకు తోడు కచ్చితత్వం ఇందులో సాధ్యపడుతుంది.

ఇప్పుడు చాట్ జీపీటీ ఏం చేస్తుందో చూస్తున్నారుగా.. ఏది అడిగినా దాదాపు చక్కని సమాచారాన్ని వేగంగా మన ముందు ఉంచుతోంది. ఆ సమాచారం అంతా కూడా నెట్ పేజీల నుంచే తెస్తోంది. అలాగే, వ్యాధి నిర్ధారణలోనూ ఒక రోగికి సంబంధించిన రికార్డులను ఏఐ టెక్నాలజీ అద్భుతంగా విశ్లేషించి, వేగంగా నివేదిక ఇవ్వగలదు. ఈ నివేదిక ఆధారంగా రోగికి ఎలాంటి చికిత్స అవసరమో డాక్టర్ సులభంగా నిర్ణయించి సూచించగలరు. అప్పుడు డాక్టర్లు, రోగుల సమయం కూడా ఆదా అవుతుంది. వైద్యులపై పని భారం తగ్గుతుంది. దాంతో వారు రోగుల సంరక్షణపై మరింత సమయం వెచ్చించగలరు. మెరుగైన వైద్యానికి వీలు పడుతుంది.

రోగికి సరైన ఔషధాలు సూచించడం చికిత్సలో అత్యంత కీలకమైన అంశం అవుతుంది. ఏఐ దీన్ని మరింత మెరుగుపరుస్తుంది. రోగి జన్యువులు, జీవనశైలి విధానం, వ్యాధి నిర్ధారణ పరీక్షల సమాచారం వీటన్నింటినీ ఏఐ విశ్లేషిస్తుంది. దీంతో విడిగా ఒక్కో రోగికి అనుకూలమైన, సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యపడుతుంది. రోగి డేటా ఆధారంగా భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను కూడా ఏఐ టెక్నాలజీ ముందే గుర్తించగలదు. దీంతో వాటి నివారణపై దృష్టి పెట్టడం వీలవుతుంది.

### ఔషధ పరిశోధన వేగవంతం

ఒక కొత్త ఔషధాన్ని పరిశోధించి మార్కెట్లోకి తీసుకురావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. ఏఐ దీన్ని మరింత వేగవంతం చేయగలదు. క్లిష్టమైన బయోలాజికల్ డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు. అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కనుక మనిషికి ఉండే పరిమితులు ఉండవు. తప్పులను దాదాపు నివారించొచ్చు. ప్రభావవంతమైన ఔషధాలను గుర్తించగలదు. వాటి సామర్థ్యాన్ని తేల్చగలదు. దీనివల్ల తక్కువ సమయంలోనే సమర్థవంతమైన నూతన ఔషధాలను తీసుకురావడం వీలు పడుతుంది. దీనివల్ల ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్ లో డేటా పరంగా ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది. ఔషధ పరీక్షల్లో డేటాకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అంతేకాదు ఒక ఔషధానికి సంబంధించి వేలు, లక్షలాది పేజీల డేటా ఉంటుంది. దీన్ని కచ్చితత్వంతో విశ్లేషించడం మనుషుల కంటే ఈ టెక్నాలజీయే సమర్థవంతంగా, వేగంగా చేయగలదు.

### టెలీ హెల్త్

ఏఐ వల్ల మరో సౌలభ్యం ప్రతిదానికీ రోగి వైద్యుడి వరకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. రోగి తాను ఉన్న చోట నుంచే ఈ టెక్నాలజీ సాయంతో వైద్యుడి సలహా, సూచనలు పొందొచ్చు. టెలీ హెల్త్ రూపంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సేవలను ఏఐ మరింత మెరుగుపరుస్తుంది. వేగవంతం చేస్తుంది. రోగి ఎక్కడున్నా, అతడికి సంబంధించిన తాజా సమాచారం ఏఐ ఆధారిత హెల్త్ గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వైద్యుడికి చేరవేయగలదు. బ్లడ్ షుగర్, బీపీ, ఆక్సిజన్, హృదయ స్పందనలు తదితర ప్యారా మీటర్లు ఎలా ఉన్నదీ వైద్యులకు ఏఐ ఎప్పటికప్పుడు తాజా సమాచారం ఇస్తుంది. దాంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యుడు సూచిస్తాడు. ముఖ్యంగా వైద్య సేవలు అంతగా అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు ఇది ఎక్కువ ఉపయోగకరం. మెరుగైన వైద్య సేవలను వేగంగా అందించడంలో సాయపడుతుంది. కొన్ని సర్జరీల తర్వాత రోగులు కోలుకోవడాన్ని ఏఐ టెక్నాలజీతో పర్యవేక్షించొచ్చు. గాయపడిన వారు, వైకల్యంతో బాధపడే వారు చికిత్సతో పొందుతున్న ఫలితాలను వైద్యులు రిమోట్ గా విశ్లేషించడం సాధ్యపడుతుంది.

### నిర్వహణ సులభతరం

వైద్యుల అపాయింట్ మెంట్, పేషెంట్ రికార్డుల నిర్వహణ, బీమా క్లెయిమ్ ల వ్యవహారాలు చూడడాన్ని ఏఐ చేయగలదు. దీనివల్ల విలువైన మానవ వనరులను ఆదా చేసుకోవచ్చు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

### వైద్య విద్య కొత్త పుంతలు


వైద్య విద్యలో ప్రాక్టికల్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఏఐ దీన్ని నవీకరించగలదు. మెడికల్ కోర్సులు చేసే అభ్యర్థులకు నేర్చుకోవడాన్ని సులభతరం చేస్తుంది. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇందుకు సాయపడతాయి.

ఇవి కాకుండా వైద్య రంగంలో సరఫరా వ్యవస్థ ఎంతో కీలకమైనది. కరోనా వచ్చినప్పుడు సప్లయ్ చైన్ లో సమస్యలను చూశాం. కానీ, ఏఐ టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వస్తే సప్లయ్ చైన్ మరింత బలపడుతుంది. ఔషధాలు, ఉపకరణాలు తదితర ఇన్వెంటరీ నిర్వహణ, అసలు డిమాండ్ ఎంత మేర ఉంది, దానికి తగ్గట్టు వేగంగా సరఫరా ఎలా చేయాలి? అనేది ఏఐతో సులభతరం అవుతుంది. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వైద్య రంగంలో వస్తున్న మార్పులు, కొత్త వ్యాధులు ప్రబలడం తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ, విశ్లేషిస్తూ ముందస్తు నివారణ చర్యలను సైతం ఏఐ సూచించగలదు.

# బాలీవుడ్ కి బోయపాటి వెళ్తే విధ్వంసమే!



బోయపాటి సినిమాల్లో యాక్షన్ సీన్లు..ఎలివేషన్లు ఏ రేంజ్ లో ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. కంటెంట్ లో కటౌట్ ఎలా ఉన్నా? ఎలివేషన్ తో హీరోని లేపడం అన్నది బోయపాటి స్పెషలిస్ట్. అందుకే బాల య్యకు సెకెండ్ ఇన్నింగ్స్ లో ఓ కొత్త రకమైన ఇమేజ్ క్రియేట్ అయింది. ఇంత వరకూ బోయపాటి-బాలయ్య కాంబి నేషన్ ఫెయిలైంది లేదు అంటే? కారణం బోయపాటి ఎలివేషన్. 'వినయ విధేయ రామ' లోనూ రామ్ చరణ్ ని అలాగే లేపాలని చూసారు కానీ పనవ్వలేదు. రామ్ తోనూ అలాంటి ఎలివేషన్ ట్రై చేసాడు కానీ వర్కౌట్ అవ్వలేదు. అప్పటికే బోయపాటితో నాలుగైదు సినిమా చేసేయడంతో? తెలుగు ఆడియన్స్ కి బోయపాటి ఫార్ములా రొటీన్ గా మారిపోయింది. ఈ కారణంతోనే ఇతర హీరోలతో బోయపాటి స్ట్రాటజీ వర్కౌట్ అవ్వలేదు. అయితే ఇదే ఎలివేషన్ బోయపాటి బాలీవుడ్ కి వెళ్లి అక్కడ హీరోకిస్తే పీక్స్ లో ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.బోయపాటి మార్క్ సినిమాలు బాలీవుడ్ లో ఇంత వరకూ ఏ డైరెక్టర్ ప్రయత్నించలేదు. ప్రస్తుతం బాలీవుడ్ తెలుగు మాస్ కంటెంట్ అక్కడ ఆడియన్స్ కి బాగా ఎక్కుతోన్న సంగతి తెలిసిందే. భారీ యాక్షన్ సన్నివేశాలు...హీరో వన్ సైడ్ వార్ కి అక్కడ మాస్ బాగా కనెక్ట్ అవుతుంది. %-%పుష్ప%-% చిత్రం సక్సస్ అవ్వడానికి కారణంగా అదే. అలాగే %-%సరైనోడు%-% యూట్యూబ్ లో ట్రెండింగ్ లో నిలవడానికి ప్రధాన కారణం కూడా అదే.హీరోల మాస్ ఎలివేషన్ పాత్రలకు అక్కడ ఆడియన్స్ పిచ్చెక్కిపో తున్నారు. ఈ నేపథ్యంలో బోయపాటి బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడానికి ఇదే సరైన టైమ్. మాస్ ఇమేజ్ ...కటౌట్ ఉన్న హీరో ని పట్టుకుని బోయపాటి మార్క్ యాక్షన్ మార్క్ చిత్రం చేసాడంటే? దుమ్ముదు పేస్తుందంటున్నారు.



## రాశి ఖన్నా యొక్క అద్భుతమైన క్లిక్‌లు



## వైట్‌లో గార్జియస్ కావ్యా థాపర్ విజన్

# 'హిట్ 3'.. నాని గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు!

నాని హీరోగా నటించనున్న 'హిట్ 3' సినిమా గురించి రోజుకో కొత్త అప్డేట్ బయటికి వస్తోంది. మొదటి రెండు భాగాల్లో వరుసగా విశ్వక్ సేన్, అడివి శేష్‌లు లీడ్ రోల్స్ చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీలో.. ఇప్పుడు నాని మెయిన్ లీడ్‌గా వస్తుండటం సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇదే సర్‌ప్రైజ్‌కు తోడు.. ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన నటుడిని తీసుకొచ్చినట్టు సమాచారం. సినిమా కేవలం తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా.. పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఉండబోతోందట.దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత విస్తృతంగా అందరికి కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేశారని సమాచారం. కాశ్మీర్ నుంచి బీహార్ వరకు విస్తరించిన కథాంశంతో, ఇండియా మొత్తం తిరిగే ప్లాన్‌లో ఉన్నట్లు టాక్. ఇందులో హిందీలోనే మాట్లాడే ఒక క్యారెక్టర్ కాస్త హైలెట్ అవుతుందట. ఇక అందుకు అవసరమయ్యే క్యారెక్టర్‌కు ఒక ప్రముఖ నటుడిని తీసుకున్నారట. అతను మరెవరో కాదు, 'సూపర్ బాయ్స్ ఆఫ్ మలేగావ్' ఫేమ్ సాకిబ్ అయూబ్ అని తెలుస్తోంది.

నానికి ఏ క్యారెక్టర్ కోసం ఏం కావాలో స్పష్టంగా తెలుసు. అందుకే తన వాయిస్, యాక్టింగ్ పరంగా బాగా కనెక్ట్ అయ్యేలా చేసినట్టు చెబుతున్నారు. సినిమా ప్రీ ప్రొడక్షన్ సమయంలోనే సాకిబ్‌ను ఈ పాత్రకు తీసుకోవాలని నాని డిసైడ్ అయ్యాడట. మొదటిసారి నానితో కలిసి పనిచేసే అవకాశం రావడంతో, సాకిబ్ ఆశ్చర్యపోయాడట. కానీ షూటింగ్ మొదలైన తర్వాత ఆయన నాని వర్కింగ్ స్టైల్, పర్ఫెక్షన్ చూసి



నానికి అంతం రిస్పెక్ట్ ఎందుకు ఇస్తారో అర్థమైందని అంటున్నాడు. సినిమా పాన్ ఇండియా లెవల్లో నిర్మించబోతుండటంతో.. ఇందులోని పాత్రలకు మరింత ప్రాముఖ్యత పెరిగిందట.'హిట్ 3'లో నాని చేసే పాత్రలో భారీ యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని టాక్. ఇదివరకు వచ్చిన రెండు పార్ట్స్‌లోనూ డిటెక్టివ్ థ్రిల్లర్ టోన్ ఎక్కువగా ఉండగా.. ఈసారి మాత్రం స్టోరీ మలుపులు మరింత థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. పైగా గత సినిమాల కంటే స్క్రీన్‌ప్లేలో ఇన్వెస్టిగేషన్‌ను మళ్లీ కొత్తగా ట్రై చేసినట్టు తెలుస్తోంది. హిందీ బాషా నేపథ్యంతో కూడిన క్యారెక్టర్ కావడం వల్ల సాకిబ్ ఈ సినిమా కోసం స్పెషల్‌గా వాయిస్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాడట.ఇక నాని 'హిట్ 3'కి మాత్రమే కాదు, ఈ ఫ్రాంచైజీకి నిర్మాతగా ఉండడం అతనికి స్పెషల్ క్రెడిట్ తెచ్చిపెట్టింది. గతంలో వచ్చిన రెండు భాగాలూ నాని బ్యానర్‌లోనే వచ్చాయి. కానీ ఈసారి మూడో పార్ట్‌లోనే మెయిన్ లీడ్‌గా నటిస్తూ మరో ప్రయోగం చేస్తున్నాడు. ఇది కచ్చితంగా సినిమాకు మరింత బలం ఇవ్వబోతుంది. థ్రిల్లర్ జానర్‌కు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యాన్ని నాని ఎలాగైనా మరింత ప్రామాణికంగా ఉపయోగించుకోవాలని ప్లాన్ చేస్తున్నాడు.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా 2025లో విడుదల కానుంది. అందులోనూ హిట్ ఫ్రాంచైజీ గత రెండు సినిమాలకు బాగా పేరు రావడం, టెక్నికల్ వాల్యూస్ పరంగా చాలా హై స్టాండర్డ్స్‌లో ఉండటంతో 'హిట్ 3'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి, నాని ప్రధాన పాత్రలో వచ్చిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.